టాప్ న్యూస్


## త్వరలో హౌసింగ్ పాలసీ తీసుకొస్తాం



- మధ్య తరగతి ప్రజలకు గృహ నిర్మాణం
- ఓఆర్ఆర్- ట్రిబుల్ ఆర్‌ల మధ్యలో హౌసింగ్ బోర్డు టౌన్ షిప్ లు
- వంద ఎకరాల్లో ఒక్కో టౌన్ షిప్
- మంత్రి పొంగులేటితో హిమాచల్ ప్రదేశ్ హౌసింగ్ శాఖ మంత్రి రాజేష్ ధర్మాని భేటి

03


## ఢిల్లీ ఓటర్లకు కేజ్రీవాల్ మరో హామీ



- అద్దె ఇళ్లల్లో నివసించే వారికీ ఫ్రీ కరెంట్, నీరు
- హోరాహోరి హామీలతో పార్టీల జోరు
- దేశ వ్యాప్త చర్చకు దారి

02

## రైతులకు మరో శుభవార్త



- సోలార్ పంపుసెట్లు పంపిణీ
- 25 గ్రామాల్లో ఇప్పటికే అందజేత
- డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన

02


Follow: @ANNTELUGU

19-01-2025

ANN తెలుగు

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 48 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

నిజం నిప్పులాంటిదైతే ఆ నిప్పును కప్పేసిన నివురే అధికారం ధరించిన పవరు. అధికారానికి మాయ చెయ్యడం తెలుసు. మత్తులో ముంచడం తెలుసు. పదేళ్ళ అధికారంలో కారుపార్టీ తప్పిదాలపై ఒక్కో విచారణ, వాటి వెనుక కేసులు పడుతున్నాయి. తప్పో ఒప్పో రాజకీయమో.. రాజ్యతంత్రమో. నీకు ఈడి కేసుంది.. నాకు ఈడి కేసుంది. నీకు ఎసిబి ఉంది. నాకు ఎసిబి ఉంది. కేసులు సేమ్, దర్యాప్తు సంస్థల క్వశ్చన్ పేపర్ సేమ్ అని కేసులు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి చేస్తున్న ప్రకటనలు విచారణ ఎదుర్కొంటున్నట్లుగా లేవు. విచారణ చేసి వస్తున్నట్లుగా ఉన్నాయన్న మాటలు వినబడుతున్నవి. మారిన సీఎం రేవంత్, మారని కేసీఆర్ భవిష్యత్ వ్యూహాలు కాచివడపోస్తున్నారు. కేటీఆర్ దూకుడు, కేటీఆర్ స్ఫూర్తిగా పాడి కౌశిక్ రెడ్డి లాంటి ఎమ్మెల్యేల దూకుడు బిఆర్ఎస్ పార్టీకి ఏమేరకు ప్రయోజనాలు కలిగిస్తాయో ముందుముందు తెలుస్తుంది.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో



## కొత్త బస్ డిపోలకు.. ఆర్టీసీ బోర్డు గ్రీన్ సిగ్నల్

- పెద్దపల్లి, ఏటూరు నాగారంలలో డిపోలు
- ఏడు బస్ స్టేషన్ల ఆధునీకరణకు భారీ నిధులు
- నూతన డిపోలు, బస్ స్టేషన్లను త్వరతిగతిన పూర్తి చేయాలని మంత్రి పొన్నం ఆదేశం

03



## తిరుమలలో వరుస ఘటనలు

- రంగంలోకి కేంద్రం
- 2 రోజులు పర్యటించనున్న కేంద్ర మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి
- సర్వత్రా చర్చనీయాంశం

03



## రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్ట్‌లపై కేంద్ర అటవీ శాఖ సమీక్ష

- అనుమతులు రాకపోవడంతో ఆగిపోయిన వాటిపై ఆరా
- సీఎం రేవంత్ రెడ్డి వినతితో కేంద్ర మంత్రి ఆదేశం

02

# హైదరాబాద్ గాలి మళ్ళింది



## తాజా సర్వేలో కాంగ్రెస్ పికప్

సిటీలో.. పెరిగిన రేవంత్ ప్రాబల్యం

హైడ్రా, అల్లు అర్జున్ ఎపిసోడ్‌లతో మంచిపేరు

ఎమ్మెల్యేలు మారిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు అడ్వాంటేజ్

ఎక్స్‌క్లూజివ్ రిపోర్ట్

"హైదరాబాద్ గాలి మళ్ళింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు కంచుకోటగా, లోక్ సభలో కాషాయ అడ్డాగా మారిన హైదరాబాద్ సిటీ గాలి ఇపుడు మళ్ళింది. సీఎం సాబ్ కు సిటీ సీటీ కొడుతోంది. రేవంతన్న బాగానే చేస్తుండు అని మెజారిటీ ప్రజలు, ప్రధానంగా సామాన్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హామీల ఆశలు ఉన్నా.. ప్రభుత్వం ఫర్వాలేదని, పేదల కోసం సీఎం కొట్లాడుతున్నడని సామాన్యప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇంటెలిజెన్స్ నివేదికలకు తోడు తాజాగా సి-ప్యాక్, టుడే చాణక్య వంటి సంస్థలు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించాయి. ఈ సర్వేలలో కాంగ్రెస్ పార్టీ తాను బలహీనమనుకున్న కొత్తప్రాంతాల్లో పుంజుకుంది. గతంలో బలపడ్డ ప్రాంతాల్లో కొంత ఇబ్బంది పడుతోంది. ఓవరాల్ గా సీఎంకు సామాన్యప్రజలు మంచి మార్కులే వేస్తున్నారు."

- మహా, హైదరాబాద్

మహా EXCLUSIVE REPORT

05

# మరో భారీ పెట్టుబడి

- రూ. 3500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిన ఎన్ టీటీ డాటా సెంటర్
- ఎంఓయూపై సంతకాలు.. రాష్ట్రాభివృద్ధికి కలిసి రండి
- సింగపూర్ వాణిజ్య మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- భాగస్వాములు కావాలన్న ప్రతినిధి బృందం
- పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయి
- సుముఖత వ్యక్తం చేసిన సింగపూర్ మంత్రి



**మహా :** సింగపూర్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హై యిన్‌తో భేటీ అయింది. తెలంగాణతో వివిధ రంగాలలో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణలకు పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ఈ సందర్భంగా ప్రతకినిధి బృందం వివరించింది. ప్రధానంగా నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఉన్న అనుకూలతలను వివరించారు. ప్రస్తుతం ఉన్న కంపనీలు తద్వారా ఆయా కంపనీలకు కలుగుతున్న ప్రయోజనాలు తదితర వాటిని సమగ్రంగా వివరించారు. ప్రతినిధి బృందం చేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్, తెలిపిన వివరాలతో సంతృప్తి చెందిన సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సానుకూలంగా స్పందించారు.

మిగతా 3లో

## ఫార్ములా ఈ కేసు ఏసీబీ విచారణకు ఎస్ నెక్ట్స్ ప్రతినిధులు



అగ్రిమెంట్ ఉల్లంఘన, బీఆర్ఎస్‌కు విరాళాలపై ప్రధానంగా ఆరా

వివరాలు 4లో

# అక్రమార్కుల అంతు తేలాల్సిందే..!

పైసా పైసా కూడా పెట్టి విల్లాలు కొన్నాం.. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి

ఆక్రమ రిజిస్ట్రేషన్ల నేపథ్యంలో గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ పై న్యాయ చర్యలు

ఇండో ఖతార్ విల్లాల యజమానుల ఆందోళన.. అక్రమాలను వెలికితీసిన మహా పత్రిక

**ఖమ్మం, జనవరి 18, మహా.** గ్రేటర్ కమ్యూనిటీలో విల్లాలు కొనుగోలు చేసిన వారి ఆశలను అక్రమార్కులు కొల్లగొట్టారు. పైసా పైసా కూడా పెట్టి ఇండ్లు కొనుగోలు చేసిన చివరకు దుర్మార్గుల మోసాలకు బలి కాక తప్పడం లేదు. వృద్ధాప్యంలో ప్రశాంతంగా జీవించాలనుకున్న అభాగ్యుల ఆశలను కాసుల కోసం కక్కుర్తి పడిన దగా కోరులు తుంచి వేస్తున్నారు. ఖమ్మం నగరానికి అతి సమీపంలో గ్రీన్లాండ్ వెంచర్లు జరుగుతున్న అక్రమాలను "మహా పత్రిక" ఏ ఎన్ ఎన్ న్యూస్ ఛానల్ బయటకు తీయడంతో సంబంధిత బాధితులు బోరున విలపిస్తున్నారు.

మిగతా 2లో




## తప్పు జరిగింది..!

ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి.. సబ్ రిజిస్టర్‌కు లేఖ

గ్రీన్‌లాండ్ డెవలపర్స్ సంస్థ ప్రకటన

02



Greenlands
SATELLITE TOWNSHIP
KHAMMAM

To,
The Sub-Registrar,
Wyra, Khammam District,
Telangana.


Date: 17.01.2025

Sub: Intimation regarding the erroneous Sale transactions pertaining to Plot Nos.6, 80, 108, 134, 135 by M/s. Green Land Developers, Khammam.

Respected Sir,

# ఈటలే బీజేపీ రథ సారధి

## చెప్పకనే చెప్పిన కిషన్ రెడ్డి



చిరంజీవిని కుటుంబ సభ్యుడిగా భావిస్తా..


సినీ రంగంలోని ఎంతో మంది బీజేపీతో సంబంధాలున్నవారే

ప్రజలను వంచించడం కాంగ్రెస్ సంస్కృతి

స్థానిక సంస్థల్లో ఒంటరి పోటీ.. పార్టీ నిర్మాణంపై స్పెషల్ ఫోకస్

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిపై, ఢిల్లీలోని తన నివాసంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో సినీ నటుడు చిరంజీవి పాల్గొనటంపై కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడు కావాలంటే ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అయితే బీజేపీ అధ్యక్ష రేసులో ఉండేవారు రెండుసార్లు బిజెపి క్రియాశీలక సభ్యత్వం ఉంటే సరిపోతుందన్నారు. అంతేకాదు రెండుసార్లు బీజేపీ గుర్తుపై పోటీ చేసినా సరిపోతుందన్నారు.

మిగతా 2లో




## కాల్పుల కేసులో పురోగతి

నిందితుడిని గుర్తించిన పోలీసులు

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అని తేల్చిన అధికారులు

నిందితుల కోసం రంగంలోకి నాలుగు రాష్ట్రాల పోలీసులు

03

## ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హతం



- రెండు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్
- బడే చొక్కారావు మృతి
- తెలంగాణలో ఉద్యమానికి కీలక దెబ్బ

03

రైతులకు మరో శుభవార్త

# సోలార్ పంపుసెట్లు పంపిణీ

**25 గ్రామాల్లో ఇప్పటికే అందజేత.. డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన**




**హైదరాబాద్, మహా :** రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్ర రైతులకు శుభవార్త మీద శుభవార్తలు చెబుతూనే ఉంది. మొన్ననే అన్నదాతల రుణాలు మాఫీ చేసిన సర్కార్.. ఇప్పుడు జనవరి 26 నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. ఇక భూమిలేని రైతు కూలీలకు కూడా ఇందిర ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేల ఆర్థిక సాయం అందించనున్నట్టు తెలిపింది. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో శుభవార్త వినిపించారు. తెలంగాణలోని రైతులకు వ్యవసాయ మోటర్లకు సోలార్ పంపు సెట్లు అందించనున్నట్టు డిప్యూటీ సీఎం కీలక ప్రకటన చేశారు. శనివారం టీజీఎన్‌పీడీసీఎల్ సంస్థలో ఎంపికైన పలువురు జూనియర్ అసిస్టెంట్ అభ్యర్థులకు భట్టి విక్రమార్క నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి గడిచిన పదేళ్లలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదన్నారు. ముఖ్యంగా గ్రూప్1 పరీక్ష రాయాలనే ఆశ చాలా మందికి గత పదేళ్లలో నెరవేరలేదని చెప్పుకొచ్చారు. ఉద్యోగాలు వస్తాయని రాష్ట్ర కోసం పోరాడితే అది నెరవేరలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు భావించారని తెలిపారు. ప్రజాప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే 56 వేల మందికి నియామకపత్రాలు అందజేసిందని భట్టి విక్రమార్క చెప్పారు. విద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. మరోవైపు రోజురోజుకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు భట్టి తెలిపారు. భవిష్యత్‌లో విద్యుత్ డిమాండ్ 22,400 మెగావాట్లకు పెరగనుందని అంచనా వేశారు. ఫ్యూచర్ సిటీలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు చాలా ఉన్నాయనన్నారు. వచ్చే పదేళ్లలో పెరిగే అవసరాల దృష్ట్యా 31 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రచిస్తున్నట్టు వెల్లడించారు. 2035 కల్లా 40 వేల మెగావాట్ల విద్యుత్‌ను రాష్ట్రంలో తయారు చేయడానికి విద్యుత్ శాఖ కసరత్తు చేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ కోసం విద్యుత్ శాఖకు ప్రతి నెలా రూ.148 కోట్లు చెల్లిస్తున్నట్లు భట్టి తెలిపారు. రైతుల మోటర్లకు సోలార్ పంపు సెట్లు అందించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్లు భట్టి స్పష్టం చేశారు. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టు కింద 25 గ్రామాల్లో సోలార్ పంపు సెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ మొత్తం సోలార్ పంపు సెట్లు అందించనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం ప్రపంచమంతా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి వెళ్లిపోతున్నాయని.. అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం కూడా కసరత్తు చేస్తోందని భట్టి వివరించారు. గత పదేళ్లుగా తెలంగాణలో కొత్త ఎనర్జీ పాలసీ తీసుకురాలేదని, దేశంలోనూ ఎనర్జీ పాలసీ లేకపోవడం వల్ల సోలార్ ఎనర్జీ, ఫ్లోటింగ్ సోలార్, పంప్ స్టోరేజ్ ఎనర్జీ, హైడ్రోజన్ పవర్ లాంటి రకరకాల పవర్‌లకు సంబంధించిన వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని భట్టి విక్రమార్క విమర్శించారు.

చత్తీస్ ఘడ్ ఎన్‌కౌంటర్‌లో

## మావోయిస్టు కీలక నేత హతం

- రెండు రోజుల క్రితం జరిగిన ఎన్ కౌంటర్ బడే చొక్కారావు మృతి
- తెలంగాణలో ఉద్యమానికి కీలక దెబ్బ





**మహా :** మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈనెల 16న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్‌మారేడుబాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతిచెందారు. రెండ్రోజుల క్రితం మావోలు, భద్రతా దళాలకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో చొక్కారావుతోపాటు 18 మంది నక్సల్స్ మృతిచెందినట్లు మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు.. మావో సిద్ధాంతాలకు ఆకర్షితుడై పార్టీలో చేరాడు. 30 ఏళ్లుగా ఆయన నక్సల్ ఉద్యమంలో వివిధ హోదాల్లో పని చేశారు. కరోనాతో తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న హరిభూషణ్ మృతిచెందగా కేంద్ర కమిటీ బడే చొక్కారావుకు ఆ బాధ్యతలు అప్పగించింది. ఎన్నో ఏళ్లుగా పలు రాష్ట్రాలకు ఆయన మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం చొక్కారావుపై రూ. 50 లక్షల రివార్డు ప్రకటించగా తెలంగాణ రాష్ట్రం సైతం రూ. 25 లక్షల రివార్డు ప్రకటించింది. కాగా, ప్రస్తుతం ఎదురు కాల్పుల్లో ఆయన మృతిచెందారు. చొక్కారావు భార్య రజితను సైతం 2023లో పోలీసులు అరెస్టు చేశారు.

# ఈటలే బీజేపీ రథ సారధి

(మొదటిపేజీ తరువాయి)

అంతేకాదు బీజేపీ నుండి మల్కాజిగిరి పోటీ చేసి ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈటల రాజేందర్ కూడా బిజెపి అధ్యక్షుడు రేసులో ఉంటారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలతో రాబోయే రోజుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఈటల రాజేందర్ అవుతారా అన్నది ఇప్పుడు పార్టీలో ఆసక్తికరంగా మారింది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని నిర్ణయించే విషయంలో పూర్తి నిర్ణయాధికారం అధిష్టానానికే ఉందన్నారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో చిరంజీవి పాల్గొనడం పైన కూడా ఆయన స్పందించారు. మెగాస్టార్ చిరంజీవితో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ఆ సంబంధాల నేపథ్యంలో తాను పిలిస్తే తన మాట కాదనకుండా చిరంజీవి వస్తారని ఆయన అన్నారు. చిరంజీవి నేను ఒకరిని ఒకరం కుటుంబ సభ్యులుగా భావిస్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఒక్క చిరంజీవి మాత్రమే కాదు చాలామంది సినీ ప్రముఖులతో బీజేపీకి సంబంధాలు ఉన్నాయని, చాలామంది పార్టీలో చేరి మంత్రులు, కేంద్ర మంత్రులు కూడా అయ్యారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొన్న సమయంలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధ్యక్ష పదవిని ఎవరికి కట్టబెట్టబోతున్నారు అన్నది అందరూ ఆసక్తిగా చూస్తున్న తరుణంలో కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మరింత ఆసక్తి నెలకొంది. వారం రోజుల తర్వాత తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని ఎన్నుకుంటారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవమై ఉంటుందన్నారు. బూత్ కమిటీలు, మండల కమిటీలు, కొత్త సభ్యత్వాలు పూర్తయ్యాయని తెలిపారు.



మండల కమిటీల్లో సగానికి పైగా బీసీలకే అధ్యక్ష బాధ్యతలను అప్పగించామని చెప్పారు. పార్టీలో మహిళలకు 33 శాతం పదవులు ఇస్తామని తెలిపారు. సంస్థాగత ఎన్నికలున్నందున ప్రజా శమస్యల పోరాటంలో బీజేపీ కొంత వెనక్కు తగ్గిందన్నారు. పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో ఉద్యమాలు అనుకున్నంత జోరుగా సాగని మాట వాస్తవమేనని అన్నారు. పార్టీ నిర్మాణం పూర్తయితే బీజేపీకి రాష్ట్రంలో తిరుగు ఉండదన్నారు. త్వరలో జరిగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ చెప్పుకోతగ్గ సీట్లను సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ ల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదన్నారు. అవసరమైతే స్థానికంగా ఉన్న కుల సంఘాలు, యువజన సంఘాలు తదితర వాటిని కలుపుకు పోతుందన్నారు.

**రేవంత్ ప్రచారంతో ఢిల్లీలో కాంగ్రెస్ గెలుస్తదా**

రేవంత్ రెడ్డి ప్రచారం చేసినంత మాత్రాన ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పడతాయా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో రేవంత్ ఫచ్చి అభద్ాలు మాట్లాడారని, అయినా ప్రజలు చైతన్యవంతులని, ఎవరేం చేస్తున్నారు, ఎవరేం చెప్తున్నారని గ్రహిస్తున్నారన్నారు. ఉచితాలు వద్దని బీజేపీ ఎప్పుడూ చెప్పలేదని, రాష్ట్ర ఆదాయ వనరులు చూసుకొని పథకాలను అమలు చేయాలని చెప్పామన్నారు. అసెంబ్లీ ఎనేనికల సందర్భంగా కాంగ్రెస్ తెలంగాణ ప్రజలకు ఏం చెప్పింది, ఇప్పుడు ఏం చేస్తుందనేది యావత్ దేశ ప్రజలకు తెలుసన్నారు. అలవి కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని, వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ పునాదులే అబద్ధాల పునాదులన్నారు. రేవంత్ ఢిల్లీలో ఏదో మాట్లాడితే కాంగ్రెస్ గెలిచిపోతుందనుకోవడం భ్రమేనని అన్నారు.

**ఆ మూడు పార్టీలు ఒక్కటే**

ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు ఒక్కటేనని, గతంలో అనేక సందర్భాలలో ఈ మూడు పార్టీలు కలిసి పని చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. తెలంగాణలో బీజేపీని ఎదుగకుండా అడ్డుకోవడం కోసం ఎంఐఎం ఎప్పుడూ ప్రయత్నిస్తుందని, అందులో భాగంగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరడం ఓవైసీ సోదరులకు అలవాటని వ్యాఖ్యానించారు. మూసీ ప్రక్షాళన జరగాల్సిందే, నల్గొండ జిల్లా ప్రజలకు శుభ్రమైన మూసీ నీరు అందాల్సిందేనని అన్న కిషన్ రెడ్డి ఎలాంటి కూల్చి వేతలు లేకుండా ప్రక్షాళన జరగాలన్నారు. హైదరాబాద్ తో పాటు తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు అందిస్తుందన్నారు. మెట్రో విస్తరణ కోసం కావాల్సిన నిధులను కేంద్రం ఇస్తుందన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో భేటీ అయి మెట్రో నిర్మాణం తదితర అంశాలపై చర్చిస్తానని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారమే ఏపీకి నిధులను కేటాయించామని చెప్పారు. ఏపీకి ఎక్కువ నిధులిస్తున్నారన్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు.

ఫార్ములా ఈ కేసు

## ఏసీబీ విచారణకు ఎస్ నెక్ట్స్ ప్రతినిధులు

**అగ్రిమెంట్ ఉల్లంఘన, బీఆర్ఎస్‌కు విరాళాలపై ప్రధానంగా ఆరా**

**హైదరాబాద్, మహా :** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో శనివారం ఏసీబీ విచారణకు ఎస్ నెక్ట్స్ జెన్ కంపనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్‌ఎండీఏ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిను ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. 2022 అక్టోబర్ 25న జరిగిన తొలి ఒప్పందంపై కంపెనీ ప్రతినిధులను ఏసీబీ ప్రధానంగా ప్రశ్నించింది. సీజన్ 9, తర్వాత రేస్‌ల నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకోవడంపై ఆరా తీశారు. సీజన్ 9 మిగతా రెండు విడతల డబ్బులు ఎందుకు చెల్లించలేదన్న వివరాలపై ఆరా తీశారు. సీజన్ 9 కోసం కేవలం ఒక దఫా రూ. 30 కోట్లు మాత్రమే గ్రీన్‌కో చెల్లించింది. మిగతా రెండు విడతల డబ్బులు ఎఫ్‌ఈవోకు గ్రీన్‌కో ఎగ్గొట్టింది. సీజన్ 10 తో పాటు నాలుగు సీజన్‌లకు ఒప్పందం చేసుకున్నప్పటికీ ఎందుకు వెనక్కి వెళ్లిందో అని నెక్ట్స్ జెన్ కంపనీ ప్రతినిధులను ఏసీబీ ప్రశ్నించింది. అగ్రిమెంట్ ఉల్లంఘనకు ప్రధాన కారణం ఏమిటి అని గ్రీన్‌కోను క్వశ్చన్ చేసింది. బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చిన ఎలక్టొరల్ బాండ్స్ తేదీలపైనా ఏసీబీ ప్రధానంగా దృష్టి సారించి కొంత సమాచారాన్ని రాబట్టింది.

ఫార్ములా ఈ కార్ రేసింగ్ సంబంధించి ఎస్ నెక్ట్స్ జెన్ కంపెనీ ప్రతినిధులకు ఏసీబీ నోటీసులు ఇచ్చింది. వ్యక్తిగతంగా హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. దీంతో ఈరోజు ఉదయం 10 గంటలకు ఏసీబీ ముందు విచారణకు హాజరు కావాల్సి ఉండగా.. ఇతర రాష్ట్రం నుంచి వస్తున్న క్రమంలో ఫ్లైట్ డిలే కావడంతో ఏసీబీ అధికారుల అనుమతి తీసుకుని మధ్యాహ్నానికి సదరు కంపెనీ ప్రతినిధులు విచారణకు వచ్చారు. సీజన్ 9 నిర్వహణకు సంబంధించిన ఒప్పంద పత్రాలు, సీజన్ 10 నుంచి ఎందుకు వైదొలిగారు అనే అంశాలపై కంపెనీ ప్రతినిధులను వివరాలు అడిగి.. వారు



ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు ఏసీబీ అధికారులు. రూ. 55 కోట్లు ఎఫ్‌ఈవో కంపెనీకి బదిలీ అయిన తర్వాత సీజన్ 10ను నిర్వహించేందుకు ఎఫ్‌ఈవో కంపెనీ కూడా నిరాకరించడంతో.. ముందస్తు ఒప్పందాలను కూడా ఉల్లంఘించారని ప్రభుత్వం భావిస్తోంది. 2022 అక్టోబర్ 25న జరిగిన తొలి ఒప్పందానికి సంబంధించి డాక్యుమెంట్లతో ఎస్ నెక్ట్స్ జెన్ కంపనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఒప్పందాల వివరాలు, స్పాన్సర్‌షిప్, ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత నష్టం వాటిల్లిదనే దానిపై ఏసీబీ విచారించింది. అవసరం అనుకుంటే మరోసారి కూడా విచారణకు రావాల్సి ఉంటుందని విచారణ ముగిసిన అనంతరం కంపనీ ప్రతినిధులకు ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. మధ్యాహ్నం నుంచి విచారణ ప్రారంభమైన నేపథ్యంలో ఈరోజు సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. సమయం తక్కువగా ఉన్న తరుణంలో మరోసారి విచారణకు రావాల్సిందిగా కంపెనీ ప్రతినిధులకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కేటీఆర్‌లను ఏసీబీ విచారణ జరిపి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన నేపథ్యంలో వారి స్టేట్‌మెంట్ ఆధారంగా కంపెనీ ప్రతినిధులను ఏసీబీ ప్రశఅనించినట్లు సమాచారం. అలాగే కేసులో అనుబంధ కంపెనీలు ఉన్నందున వాటికి కూడా నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని ఏసీబీ భావిస్తోంది.

## రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర అటవీ శాఖ సమీక్ష

- అనుమతులు రాకపోవడంతో ఆగిపోయిన వాటిపై ఆరా
- సీఎం రేవంత్ రెడ్డి వినతితో కేంద్ర మంత్రి ఆదేశం



**హైదరాబాద్, జనవరి 18:** కేంద్ర అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో నిలిచి పోయిన పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర అటటవీ శాఖ అధికారుల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఆదేశాలతో హైదరాబాద్‌కు వచ్చిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ జితేంద్ర కుమార్ బృందం శనివారం అరణ్య భవన్‌లో రాష్ట్ర అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించింది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని విన్నవించారు. తెలంగాణలో 161 ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్రమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా నగరానికి వచ్చిన కేంద్ర బృందం.. తెలంగాణలో అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో ఆగిపోయిన ప్రాజెక్టులపై చర్చించారు. తెలంగాణ అభివృద్ధిలో సీఎం రేవంత్ రెడ్డి మార్క్ కనిపిస్తోంది. అభివృద్ధి విషయంలో కేంద్రంతో భేషజాలు ఉండవని పలుమార్లు రేవంత్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. గత పదేండ్లు కేంద్రంతో పేచీలు పెట్టుకొని తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ సహకరించలేదని.. ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెండింగులో ఉన్న ప్రాజెక్టుల విషయంపై కేంద్రంతో మాట్లాడాలని పది రోజుల క్రితం రాష్ట్ర అటవీ శాఖ అధికారులను రేవంత్ ఆదేశించారు. అవసరమైతే తానే వచ్చి కేంద్రమంత్రితో మాట్లాడుతానని అధికారులకు చెప్పారు. అనుకున్న విధంగానే కేంద్రమంత్రిని సీఎం రేవంత్ కలవడం, దానికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడం, రాష్ట్రానికి కేంద్ర అటవీశాఖ అధికారులు రావడం చకచకా జరిగిపోయాయి. సీఎం చూపిన చొరవ వల్లే డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ వచ్చారని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.

# అక్రమార్కుల అంతు తేలాల్సిందే..!

(మొదటిపేజీ తరువాయి)

మాకు తెలియకుండా మా విల్లాలను, భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆందోళనకు దిగుతున్నారు. ఇందులో భాగంగానే శనివారం నాడు ఇండో కటార్ గ్రీన్లాండ్ వెంచర్ లో విల్లాలు భూములు కొనుగోలు చేసిన బాధితులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గోడును వెళ్లబుచ్చుకున్నారు. 2017 నుంచి 2022 వరకు ఇండో ఖతార్ ప్రాజెక్ట్‌లో భాగంగా పలువురు, కోనేరు ప్రసాద్, మద్దెల నటరాజు, కొక్కుల రాధాకృష్ణ, తుమ్మలపల్లి ప్రవీణ్ వంటి ప్రముఖులు విల్లాలు కొనుగోలు చేశారు. ఈ విల్లాలు కొనుగోలు చేసే సమయంలో వారు గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ సంస్థకి రూ.65 లక్షల నుంచి రూ.75 లక్షల వరకూ వెచ్చించారు. అయితే, తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన తమను ఆందోళన గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. 28 డిసెంబర్ న గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ సంస్థకు చెందిన కిషోర్, రాము, నాగేశ్వరరావు, శరత్ అనే వ్యక్తులు, వారి విల్లాలపై అక్రమంగా ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేశారని పేర్కొన్నారు.

**విల్లాల యజమానుల ఆందోళన:**

కోహెనెరు ప్రసాద్, మద్దెల నటరాజు, కొక్కుల రాధాకృష్ణ, తుమ్మలపల్లి ప్రవీణ్, విల్లాల యజమానులుగా, తమ విల్లా నెంబర్లను 80, 108, 134, 135 గా గుర్తించి, తమకు తెలియకుండా వీరు ఇతరులకు రిజిస్ట్రేషన్లు చేసారని ఆరోపించారు. ఈ ఘటన వల్ల,



తమ జీవితంలో మార్పులు వచ్చాయని, వారు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని వివరించారు. విల్లాల యజమానులు చెప్పిన విధంగా, ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు కారణంగా వారు నిద్రలేని రాత్రులు గడిపారని, ఆర్థిక పరంగా కూడా ఈ ఘటన ప్రభావితం చేసిందని అన్నారు. మార్టేజ్ , బ్యాంకు రుణాలు తీసుకున్న వారు, ఈ రుణాలపై అధిక బరాన్ని మోయాల్సి వచ్చిందని తెలిపారు.

**తమ పన్నులు చెల్లించిన పరిస్థితి:**

అక్రమ రిజిస్ట్రేషన్ల పట్ల యజమానులు మరొక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. వారు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ పంచాయతీకి తమ ఇంటి పన్నులను చెల్లిస్తున్నారని తెలిపారు. అలాంటి సమయంలో, తమ విల్లాలపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగి, వారు చెల్లించిన పన్నులు మరింత నష్టపోయాయని వారు చెప్పారు. ఈ కారణంగా వారు ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**అక్రమ రిజిస్ట్రేషన్లపై సీరియస్ చర్యలు:**

ఈ సంఘటనపై విల్లాల యజమానులు, గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ సంస్థకు చెందిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో పూర్తి విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు. వారు ఈ రకమైన అక్రమ చర్యలను అడ్డుకోవడంపై ప్రభుత్వాన్ని శక్తివంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం , సంబంధిత సంస్థలు ఈ సంఘటనపై తక్షణమే స్పందించాలని, విల్లాల యజమానులు డిమాండ్ చేశారు. ఈ రకమైన అక్రమం మరింత విస్తరించకుండా ఉండేందుకు, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వారు అడిగిన దాంట్లో, బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి


**పరిష్కారం కోసం పోరాటం:**

విల్లాల యజమానులు తమకు జరిగిన ఈ అక్రమ రిజిస్ట్రేషన్లపై పోరాటం కొనసాగించనున్నట్లు ప్రకటించారు. వారు గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ సంస్థకు చెందిన కిషోర్, రాము, నాగేశ్వరరావు, శరత్ అనే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇదే అంశం భవిష్యత్తులో మరింత విస్తరించకుండా ఉండేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టడంలో ప్రభుత్వ చర్యలు కీలకమవుతాయి. పలు గ్రామాల్లో విల్లాల యజమానుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఈ చర్యలు సమగ్రంగా, కఠినంగా ఉంటాయని బాధితులు ఆశిస్తున్నారు. వారికి న్యాయం చేయడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను అరికట్టడానికి సంబంధిత అధికారులను అప్రమత్తంగా ఉంచాలని వారు కోరుతున్నారు.

# తప్పు జరిగింది..!

## ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి.. సబ్ రిజిస్ట్రర్‌కు లేఖ గ్రీన్‌లాండ్ డెవలపర్స్ సంస్థ ప్రకటన

**ఖమ్మం, జనవరి 18 మహా:** గ్రీన్ ల్యాండ్ డెవలపర్ స్ సంస్థ అడుగు వెనక్కు వేసింది. తప్పు జరిగిందంటూ బహిరంగంగా ఒప్పుకుంది. జరిగిన రిజిస్ట్రేషన్ లను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్కు సైతం లేఖ రాసింది. గ్రీన్లాండ్ వెంచర్ లో జరుగుతున్న అక్రమ రిజిస్ట్రేషన్ లపై ఏఎన్ఎన్ ఛానల్, మహా పత్రిక వెలుగులోకి తేవడంతో అక్రమార్కుల ఆగడాలు బహిర్గతమైనాయి. దీంతో వెంచర్ నిర్వాహకులు జరిగిన తప్పిదాన్ని బహిరంగంగా ఒప్పుకోవడమే కాకుండా జరిగిన రిజిస్ట్రేషన్ల సైతం రద్దు చేయాలని కోరుతూ వెనకడుగు వేశారు. ఖమ్మం నగరంలో గ్రీన్‌లాండ్ డెవలపర్స్ సంస్థ సేల్ ట్రాన్సాక్షన్లలో తప్పులు జరిగాయని అధికారికంగా ప్రకటించింది. సంస్థకు చెందిన మక్కేనా రాము, వ్యాపారవేత్త, కొన్ని ప్లాట్లపై సేల్ డీడ్స్ తప్పుగా నమోదు అయ్యాయని, దానిని సరిచేయడానికి కేవలం కెన్సలేషన్ డీడ్స్ సమర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 2024 డిసెంబరు 28న గ్రీన్‌లాండ్ డెవలపర్స్, ఖమ్మం కార్యాలయంలో కొన్ని సేల్ ట్రాన్సాక్షన్లు నమోదు చేశారు. వాటిలో 6, 80, 108, 134, 135 నంబర్లపై జారీ చేసిన సేల్ డీడ్స్ 4420/2024, 4422/2024, 4426/2024 నంబర్లతో అన్యాయంగా నమోదయ్యాయి. ఈ తప్పును గమనించిన తరువాత, గ్రీన్‌లాండ్ డెవలపర్స్ సంస్థ దాని వంతు బాధ్యతగా తక్షణమే సంభందిత వాడకరులతో సంప్రదించి, తాము చేసిన ఈ తప్పును రద్దు చేయడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా, సంస్థ అధికారికంగా ఒక ప్రకటన జారీ చేసి, సేల్ ట్రాన్సాక్షన్లను రద్దు చేయడానికి కెన్సలేషన్ డీడ్స్‌ను సమర్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. సంస్థ



Greenlands
SATELLITE TOWNSHIP
KHAMMAM

To,
The Sub-Registrar,
Wyra, Khammam District,
Telangana.

Date: 17.01.2025

Sub: Intimation regarding the erroneous Sale transactions pertaining to Plot Nos.6, 80, 108, 134, 135 by M/s. Green Land Developers, Khammam.

Respected Sir,

I, Makkena Ramu, S/o. Venkateswara Rao, Age: 55 yrs, Occ: Business, R/o. H. No. 10-11-689/12/E, Burhanpuram, Khammam, Telangana., representing on behalf of M/s. Green Land Developers, Khammam respectfully submits that, we have performed certain number of registrations before your kind office on 28.12.2024 in favour of various parties respectively. After due verification, it came to our notice that certain Sale transactions viz., Registered Sale Deed Nos.4420 of 2024, 4422 of 2024 and 4426 of 2024 pertaining to Plot Nos.6, 80, 108, 134 and 135 were erroneously performed by us due to oversight. As such, we have informed the same to the vendees of the above said Sale transactions and they have come forward to co-operate with us in cancelling the said Sale transactions.

Therefore, we are undertaking to present the cancellation deeds pertaining to the above said erroneous Sale transactions, as early as possible to rectify the mistake happened due to oversight.

Further, we sincerely informing your kind authority that the said error in performing the aforementioned registration of Sale deeds pertaining to said Plot Nos.6, 80, 108, 134 and 135 is neither wilful nor wanton and due performing the large number of Sale transactions on that day and oversight only.

Thanking you,

Yours Sincerely,
M/s. Greenland Developers,
Makkena Ramu,
S/o. Venkateswara Rao,
R/o. H. No. 10-11-689/12/E,
Burhanpuram, Khammam, Telangana.,
Mobile No.9885155698.

Note: Copy to the District Registrar, Khammam.

ఇది పూర్తిగా అనుకోకుండా జరిగిన తప్పు మాత్రమే అని, పెద్ద సంఖ్యలో సేల్ ట్రాన్సాక్షన్లు నిర్వహించడంలో జరిగిన అవగాహన లోపమే ఇందుకు కారణమని స్పష్టం చేసింది. గ్రీన్‌లాండ్ డెవలపర్స్ సంస్థ ఈ తప్పును చక్కదిద్దడంలో తీసుకుంటున్న చర్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వేగంగా పరిష్కారం తీసుకోవాలని కోరుకుంది.

# ఢిల్లీ ఓటర్లకు కేజ్రీవాల్ మరో హామీ

**ఢిల్లీ, మహా :** హోరాహోరిగా సాగుతున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రోజుకో రకమైన హామీలను పార్టీలు ప్రకటిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. రెండు మూడు దఫాలుగా ఢిల్లీని ఏలుతున్న ఆప్ పార్టీ ఈ దఫా కూడా తిరిగి పీఠాన్ని దక్కించుకోవాలన్న సంకల్పంతో దూసుకుపోతుంది. అందులో భాగంగా వరుస హామీలను ప్రకటిస్తోంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తాజాగా మరో హామీని ప్రకటించారు. తమ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజధానిలోని అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్, నీరు అందిస్తామని పేర్కొన్నారు. పూర్వాంచల్‌కు చెందిన అనేక మంది కౌలు దారులకు సైతం ఉచిత విద్యుత్, నీటి సౌకర్యాలు అందిస్తామని హామీ ఇచ్చారు. దిల్లీలో ఎక్కడికి వెళ్లినా కిరాయిదారులు మీ పాఠశాలల వల్ల మేం లబ్ధి పొందుతున్నామని చెబుతున్నారని, మొహల్లా క్లినిక్స్, ఆస్పత్రుల వల్ల, ఉచిత బస్సు సేవలు, ఉచిత తీర్థయాత్ర సేవలు పొందుతున్నామని అంటున్నారన్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఉచిత విద్యుత్, నీళ్లు మాకు రావడం లేదని వాపోతున్నారంటూ ఈ ఎన్నికల్లో మా ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే కిరాయిదారుల కోసం పథకాలు, వ్యవస్థను తీసుకొస్తామన్నారు. కిరాయిదారులకు విద్యుత్, నీళ్లు ఉచితంగా వస్తాయని ప్రకటించారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దేశ రాజధానిలోని ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఉచితాల వైపు దృష్టిసారించాయి. తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత రేషన్ కిట్లు, ఏడాది పాటు నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ. 8,500, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా వంటి ప్రయోజనాలు కల్పిస్తామని కాంగ్రెస్ పేర్కొన్న విషయం తెలిసిందే. బీజేపీ 'సంకల్ప పత్రా' పార్ట్ 1 పేరుతో విడుదల చేసిన పార్టీ హామీలను ప్రకటించింది. అందులో గర్భిణులకు రూ.21వేల ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్లు, 'మహిళా సమృద్ధి యోజన' కింద దిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం వంటి హామీలను ప్రకటించింది. ఎవరికి వారుగా అధికారం కోసం ప్రయత్నిస్తూ ఓటర్ల ప్రసన్నం కోసం ప్రకటిస్తున్న వరాలు దేశ వ్యాప్త చర్చకు దారి తీస్తున్నాయి.



# ఉగాది నుంచి గద్దర్ అవార్డుల పంపిణీ

## సినిమా నిర్మాణంలో హైదరాబాద్ ను ప్రపంచ గమ్యస్థానంగా మారుస్తాం

### గద్దర్ సినిమా అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, మహా :** ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది, అందుకు తగిన విధంగా కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం సచివాలయంలో జరిగిన గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆవార్డులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవార్డుల కోసం లోగోతో సహా విధివిధానాలు, నియమ, నిబంధనల పై కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని డిప్యూటీ సీఎం సూచించారు. కల్చరల్ ఐకాన్ గద్దర్ ప్రతిదీ పెంచేలా అవార్డుల లోగోలు రూపొందించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పది సంవత్సరాలపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన వారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు, అవార్డుల పంపిణీ జరగలేదని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే అవార్డులను ప్రతి ఏటా అందజేయాలని నిర్ణయించి గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులు ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందచేస్తారు. గద్దర్ అవార్డుకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిషోర్‌బాబు, కమిటీ చైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బస్ డిపోలకు ఆర్టీసీ బోర్డు గ్రీన్ సిగ్నల్

## పెద్దపల్లి, ఏటూరు నాగారంలలో డిపోలు.. ఏడు బస్ స్టేషన్ల ఆధునీకరణకు భారీ నిధులు

### నూతన డిపోలు, బస్ స్టేషన్లను త్వరతిగతిన పూర్తి చేయాలని మంత్రి పొన్నం ఆదేశం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో పలు కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్ల నిర్మాణం, బస్ స్టేషన్ల విస్తరణకు ఆర్టీసీ బోర్డు అనుమతి లభించింది. హైదరాబాద్ బస్ భవన్ లో శనివారం ఆర్టీసీ బోర్డు సమావేశమైంది. ఈ సమావేశంలో కొత్త డిపోలు, బస్ స్టేషన్లకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెద్దపల్లి, ఏటూరునాగారం బస్ డిపోలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. నూతన బస్ డిపోలు, బస్ స్టేషన్లను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

**నూతనంగా బోర్డ్ ఆమోదం లభించిన పనులు**

- పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లిలో కొత్త బస్ డిపో కోసం నిర్మాణం కోసం రూ.11.70 కోట్లు కేటాయిస్తూ అనుమతులు
- ములుగు జిల్లా ఏటూరునాగారంలో కొత్త బస్ డిపో నిర్మాణం కోసం రూ.6.28 కోట్లు కేటాయిస్తూ అనుమతులు
- ములుగు జిల్లా ములుగు లో కొత్త బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 5.11 కోట్లు కేటాయిస్తూ అనుమతులు
- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కొత్త బస్ స్టేషన్ కోసం రూ. 3.75 కోట్లు కేటాయిస్తూ అనుమతులు
- ఖమ్మం జిల్లా మధిరలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ.10.00 కోట్లు కేటాయిస్తూ అనుమతులు
- ములుగు జిల్లా మంగపేటలో కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 51.00 లక్షలు కేటాయిస్తూ అనుమతులు
- పెద్దపల్లి జిల్లా మంథని బస్ స్టేషన్ విస్తరణ కోసం రూ.95.00 లక్షలు కేటాయిస్తూ అనుమతులు
- సూర్యాపేట జిల్లా కోదాడ్ వద్ద ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 17.95 కోట్లు కేటాయిస్తూ అనుమతులు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం రాబోయే "సరస్వతి పుష్కరాల" దృష్ట్యా ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 3.95 కోట్లు కేటాయిస్తూ ఆర్టీసీ బోర్డు అనుమతులు ఇచ్చింది.

### అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న 97 డిపోలు, బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందని.. అందుకు అనుగుణంగా కొత్త బస్ స్టేషన్ల నిర్మాణంతో పాటు ఉన్నవాటిని విస్తరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఒకవైపు కొత్త బస్సులను కొనుగోలు చేస్తూనే.. మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. బోర్డు అనుమతి లభించిన నూతన డిపోలు, బస్ స్టేషన్లను త్వరతిగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.



# త్వరలో హౌసింగ్ పాలసీ తీసుకొస్తాం

## మధ్య తరగతి ప్రజలకు గృహ నిర్మాణం

### ఓఆర్ఆర్ ట్రిబుల్ ఆర్‌ల మధ్యలో హౌసింగ్ బోర్డు టౌన్‌షిప్‌ల.. వంద ఎకరాల్లో ఒక్కో టౌన్ షిప్

### మంత్రి పొంగులేటితో హిమాచల్ ప్రదేశ్ హౌసింగ్ శాఖ మంత్రి రాజేష్ ధర్మాని భేటి

**హైద్రాబాద్, మహా :** రాష్ట్రంలో కొత్తగా తెలంగాణ అఫర్డబుల్ హౌసింగ్ పాలసీని తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్యలో మధ్య తరగతి ప్రజానీకం కోసం కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని, కనీసం వంద ఎకరాలలో ఈ టౌన్ షిప్ లను నిర్మించి మధ్య తరగతి ప్రజానీకానికి అందుబాటులోకి తేవాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. శనివారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, టెక్నికల్ ఎడ్యుకేషన్ మంత్రి ఎస్.హెచ్. రాజేష్ ధర్మాని సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాల గురించి మంత్రిని అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ నియమ నిబంధనల మేరకు, అందుబాటులో వున్న బోర్డు స్థలాలలో కొత్తగా గృహనిర్మాణానికి సంబంధించిన స్కీములను అమలు చేయాలని ఆలోచన చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వరంగ భాగస్వామ్యంతో అఫర్డబుల్ గృహ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూముల పరిరక్షణకు ఒకవైపు చర్యలు తీసుకుంటూనే మరో వైపు వివిధ కోర్టులలో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 న అనుసరించి ఆస్తులు, అప్పుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో వచ్చే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే మొదటి దశలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందని, వీలైనంత త్వరలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని వెల్లడించారు. లబ్దిదారులే స్వయంగా ఇళ్లు నిర్మించుకునే సౌలభ్యం కూడా కల్పించామని, 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతుందని, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉండగా ఫోర్త్ సిటిగా 15 వేల ఎకరాలలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని మంత్రి తెలియచేసారు.

# తిరుమలలో వరుస ఘటనలు



**ఢిల్లీ, మహా :** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో జరుగుతున్నవరుస ఘటనలను కేంద్ర హోం శాఖ సీరియస్‌గా తీసుకుంది. వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం క్యూలైన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన తర్వాత ఘాట్ రోడ్‌లో ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, లడ్డూ పోటులో అగ్నిప్రమాదం, తమిళనాడుకు చెందిన ఒక భక్తుడు మృతి చెందడం తదితర వరుస ఘటనలను కేంద్రం సీరియస్ గా తీసుకుంది. ఘటనల పూర్వాపరాలను తెలుసుకోవడంతో పాటు భక్తుల కోసం చేపట్టిన చర్యలు, భద్రతా సిబ్బంది పనితీరు, క్యూలైన్ల నిర్వహణ, ఉద్యోగుల పనితీరు తదితర వాటన్నింటినీ పరిశీలించేందుకు ఆది, సోమవారాలలో కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ తిరుమల, తిరుపతి తదితర ప్రాంతాలలో పర్యటించనున్నారు. తొక్కిసలాట, పోటు లడ్డు పోటులో జరిగిన అగ్నిప్రమాదం తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించే అవకాశం ఉంది. అదే విధంగా థిరుమలలో అమలవుతున్న నిబంధనలు, వాటిని సక్రమంగా అమలు చేసేందుకు తీసుకుంటున్న చర్యలు తదితర వాటిపై టీటీడీ అధికారులతో భేటీ కానున్న హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్. వరుస ఘటనలపై నివేదిక ఇవ్వాలని టీటీడీ అధికారులు ఇవ్వాలని ఇప్పటికే కేంద్ర మంత్రిత్వ శాఖ కోరింది. హోం మంత్రిత్వ శాఖకు అందిన నివేదికల అనంతరం జిందాల్ పర్యటించాలని నిర్ణయించడం గమనార్హం. టీటీడీ వ్యవహారంలో మొదటి సారి కేంద్ర హోం మంత్రిత్వ జోక్యం చేసుకుంటుండటంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## ఆహా.. హైదరాబాదీ

- రష్యన్ యాత్రికుడికి వింత అనుభవం
- ఒక అరటి పండు ధర రూ. 100 చెప్పిన పండ్ల వ్యాపారి



**హైదరాబాద్, మహా :** అరటి పండ్లను మనం డజన్ లెక్కన కొనుగోలు చేస్తాం. ప్రస్తుతం మార్కెట్లో డజన్ అరటిపండ్ల ధర రూ.60 నుంచి రూ.80 వరకు ఉంది. అయితే హైదరాబాద్ నగరంలో ఓ రష్యన్ యాత్రికుడికి వింత అనుభవం ఎదురైంది. ఓ తోపుడు బండ్ల వ్యాపారి ఒక అరటిపండు ధరనే అతనికి రూ.100గా చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియోను సదరు రష్యన్ యాత్రికుడు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశాడు. ఆ వీడియోలో రష్యన్ యాత్రికుడు తోపుడు బండ్ల వ్యక్తి వద్దకు నమస్కారం చెబుతూ వెళ్లాడు. ఒక అరటిపండు ఎంత అని అడిగాడు. దానికి ఆ వ్యాపారి రూ. 100 అని చెప్పాడు. నేను ఒక్క అరటిపండు ధరను అడుగుతున్నానని పలుమార్లు ఆ రష్యన్ అడిగినప్పటికీ వంద రూపాయలు అని ఆ వ్యాపారి కరాఖండీగా చెప్పాడు. అయితే అంత ధరను తాను చెల్లించలేనంటూ సదరు యాత్రికుడు అక్కడి నుంచి ముందుకు కదలడం వీడియోలో కనిపిస్తోంది. క్రేజీ ప్రైస్ అంటూ వీడియోలో అతను పేర్కొన్నాడు. ఈ ధరతో యూకేలో ఎనిమిది అరటిపండ్లు కొనుగోలు చేయవచ్చు కానీ ఇక్కడ మాత్రం ఒక్కటే అంటున్నారని పేర్కొన్నాడు. నేను ఒకే అరటి పండుకు ధర అడిగిన విషయం సదరు వ్యాపారికి అర్థమైందనే అనుకుంటున్నానని ఆ రష్యన్ టూరిస్టు పేర్కొన్నాడు.



# కాల్పుల కేసులో పురోగతి

## నిందితుడిని గుర్తించిన పోలీసులు

### మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అని తేల్చిన అధికారులు

### నిందితుల కోసం రంగంలోకి నాలుగు రాష్ట్రాల పోలీసులు



**హైదరాబాద్, మహా :** రెండు రోజుల క్రితం హైదరాబాద్, అఫ్జల్ గంజ్ లో కాల్పులకు తెగబడ్డ నిందితుడిని మనీశ్‌గా గుర్తించారు. ఇతడు బీహార్ రాష్ట్రానికి చెందిన వాడని తేల్చారు. మనీశ్‌తో బీహార్ రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు జతకట్టాడని, వీరిద్దరూ కలిసి వారం రోజుల క్రితం చోరీలు మొదలు పెట్టారని పోలీసులు తెలిపారు. ఛత్తీస్‌గడ్‌లో వారం రోజుల క్రితం ఏటీఎం సిబ్బందిని బెదిరించి 70 లక్షల రూపాయలు మనీష్ అండ్ కో కాజేశారు. అనంతరం గురువారం బీదర్‌లో ఏటీఎం సెక్యూరిటీ గార్డ్‌ను హత్య చేసి రూ. 93 లక్షలు మనీశ్ ఎత్తుకెళ్లాడు. బీదర్ నుంచి హైదరాబాద్ వచ్చిన మనీశ్.. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపాడని పేర్కొన్నారు.

**మనీష్ పై బీహార్ ప్రభుత్వం రివార్డు**

ఇప్పటికే మనీశ్‌పై బీహార్ ప్రభుత్వం రివార్డు ప్రకటించిందని, గతంలోనూ మనీష్‌పై మర్డర్, దోపిడి కేసులు ఉన్నాయన్నారు. గతంలో కేసులు నమోదైనప్పుడు మనీష్ దేశ సరిహద్దు దాటి నేపాల్ పారిపోయాడని, కేసుల తీవ్రత తగ్గాక ఇండియాకు వచ్చి మళ్లీ దోపిడీలకు పాల్పడుతున్నాడని పోలీసులు వివరించారు. మనీశ్‌ను పట్టుకునేందుకు నాలుగు రాష్ట్రాల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారని, తెలంగాణ, బీహార్, కర్ణాటక, ఛత్తీస్‌గడ్‌లో మనీశ్ కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. అఫ్జల్‌గంజ్ లో ప్రైవేట్ ట్రావెల్ సిబ్బందిపై కాల్పుల తర్వాత అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ వెళ్లిన నిందితులు అక్కడ బట్టలు, బ్యాగులు కొనుగోలు చేశారని గుర్తించారు. తిరుమలగిరి వద్ద ఓ నిర్మానుశ్య ప్రదేశంలో బట్టలు, బ్యాగులు మార్చుకున్నారని, తర్వాత తమతో పాటు ఉన్న బ్యాగులను అక్కడే వదిలేసినట్లు తేల్చారు. సుచిత్ర వైపు నిందితులు పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులు వదిలేసిన ట్రాలీ బ్యాగులను స్వాధీనం చేసుకున్న పోలీసులు గాలింపును మరింత తీవ్రం చేశారు. దాదాపు పది బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఖచ్చితంగా కేసును చేధిస్తామని పోలీసులు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా ఈనెల 16న బీదర్‌లో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఏటీఎంలో సిబ్బంది నగదును జమ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి డబ్బును అపహరించేందుకు యత్నించారు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సెక్యూరిటీ సిబ్బందితో పాటు మరొకరు చనిపోయారు. దుండగులు దాదాపు రూ.93 లక్షల నగదును తీసుకుని అక్కడి నుంచి పరాయ్యారు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చిన దుండగులు రాయపూర్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. బస్సులో వెళ్లాలని రోషన్ ట్రావెల్స్‌లో టికెట్స్ తీసుకున్నారు. రాయపూర్ వెళ్లేందుకు అమిత్ కుమార్‌తో టికెట్ బుక్ చేసుకున్నారు. అనంతరం బస్సులో ఎక్కిన సమయంలో ట్రావెల్స్ ఉద్యోగి జహంగీర్ వీరి బ్యాగ్‌ను తనిఖీ చేశాడు. ఓ బ్యాగ్‌లో హెల్మెట్, వస్త్రాలు ఉన్నట్లు గుర్తించారు. మరో బ్యాగ్‌ను తనిఖీ చేయాలని జహంగీర్ ప్రయత్నించాడు. అందుకు వాళ్లు ఒప్పుకోలేదు. అనుమానం వ్యక్తం చేసిన ట్రావెల్స్ ఉద్యోగి పోలీసులకు చెబుతానంటూ బెదిరించాడు. దీంతో వెంటనే దుంగులు జహంగీర్‌పై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు ఎక్కడెక్కడి వెళ్లారు అనేది సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. దుండగుల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు.

**పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్..**

మరోవైపు అఫ్జల్‌గంజ్ నుంచి దుండగులు ఓ ఆటో ఎక్కి పరారైనట్లు పోలీసులు కనుగొన్నారు. దీంతో ఆటో డ్రైవర్‌ను గుర్తించిన పోలీసులు అతడి అదుపులోకి తీసుకున్నారు. అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ వరకు దొంగలను ఆటో డ్రైవర్ తీసుకు వెళ్లాడు. దీంతో దొంగలు ఎక్కడ దిగారని పోలీసులు ప్రశ్నించగా సికింద్రాబాద్ ఆల్ఫా హోటల్ వద్ద దొంగలను వదిలిపెట్టినట్టు ఆటో డ్రైవర్ తెలిపారు. ఆటోలో కూర్చున్నప్పుడు దొంగలు ఏమైనా మాట్లాడుకున్నారా అనే దానిపై ఆరా తీస్తున్నారు.

# మరో భారీ పెట్టుబడి



(మొదటిపేజీ తరువాయి)


తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రధానంగా ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలని, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని నిర్ణయించారు.

**రూ. 3500 కోట్లు పెట్టుబడికి ఎన్ టీటీ డాటా సెంటర్ ఓకే**

రాష్ట్రంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టేందుకు ఎన్‌టీటీ డేటా సెంటర్స్ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ. 3500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సింపూర్‌లోని ఎన్‌టీటీ డాటా సెంటర్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంవోయూపై ఎన్‌టీటీ సీఈవో బ్రూనో సంతకాలు చేశారు. ఇప్పటికే హైదరాబాద్ హైటెక్ సిటీలో ఓ డాటా సెంటర్ నిర్వహిస్తున్న ఎన్‌టీటీ ముచ్చర్ల మీర్‌ఖాన్‌పేట్‌లో మరో డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఎన్‌టీటీ డేటా సెంటర్స్ సంస్థ నిర్ణయాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ మారుతోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నందుకు ఎస్టీటీ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తున్న వినూత్న మార్పుల్లో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్‌ను సందర్శించి ఆ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎస్‌టీటీ గ్రూప్ సీఈవో బ్రూనో లోపెజ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. 100 మెగావాట్ల సామర్థ్యంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే అత్యాధునిక ఏఐ రెడీ డేటా సెంటర్‌ను ఈ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పనుంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డేటా సెంటర్ సామర్థ్యాన్ని పెంచుకునే సదుపాయం ఇందులో ఉంటుంది. దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్లలో ఇది ఒకటిగా నిలుస్తుంది.

# ఓయో రూంలో గంజాయి దందా

## అమ్మాయితో కలిసి పట్టుబడ్డ యువకుడు




**హైదరాబాద్, మహా :** మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. అయినా సరే.. స్మగ్లర్లు మాత్రం ఏమాత్రం భయపడకుండా.. సైలెంట్‌గా దందా సాగిస్తూనే ఉన్నారు. కానీ.. పోలీసులు కూడా అంతే సైలెంట్‌గా నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ఊచలు లెక్కబెట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే.. కొండాపూర్‌లోని ఓ ఓయో రూమ్‌లో సైలెంట్‌గా గంజాయి దందా సాగిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో కొండాపూర్‌లోని ఓయో రూమ్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయితో యువతీ యువకుడు పట్టుబడ్డారు. వీరి నుంచి.. భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలికి చెందిన రాజు, మధ్యప్రదేశ్‌కు చెందిన సంజనతో కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. గత కొంతకాలంగా అరుకు ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి.. ఓయో రూమ్‌లో ఉంటూ విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని ఎన్ డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్స్) చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యాపారం వెనుక ఉన్న ముఠా సభ్యుల వివరాలను వెలికి తీసేందుకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

**60 కేజీల గంజాయి పట్టివేత**

మరోవైపు.. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మలక్‌పేట్ నల్గొండ క్రాస్ రోడ్ వద్ద 60 కేజీల గంజాయిని సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓ కారులో గంజాయి తరలింపు జరుగుతుందని తెలుసుకున్న పోలీసులు.. నిఘా పెట్టి సదరు కారును తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 60 కేజీల గంజాయిని పట్టుబడింది. దీంతో.. వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు.. కేసుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు హైదరాబాద్ పోలీసులు కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కూడా మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏ చిన్న సమాచారం తెలిసినా.. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

EDITORIAL ఎడిటోరియల్



# మారిన రేవంత్ మారని కేసీఆర్

నిజం నిప్పులాంటిదైతే ఆ నిప్పును కప్పేసిన నివురే అధికారం ధరించిన పవరు. అధికారానికి మాయ చెయ్యడం తెలుసు. మత్తులో ముంచడం తెలుసు. పదేళ్ళ అధికారంలో కారుపార్టీ తప్పిదాలపై ఒక్కో విచారణ, వాటి వెనుక కేసులు పడుతున్నాయి. తప్పో ఒప్పో రాజకీయమో.. రాజ్యతంత్రమో. నీకు ఈడి కేసుంది.. నాకు ఈడి కేసుంది. నీకు ఎసిబి ఉంది. నాకు ఎసిబి ఉంది. కేసులు సేమ్, దర్యాప్తు సంస్థల క్వశ్చన్ పేపర్ సేమ్ అని కేసులు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి చేస్తున్న ప్రకటనలు విచారణ ఎదుర్కొంటున్నట్లుగా లేవు. విచారణ చేసి వస్తున్నట్లుగా ఉన్నాయన్న మాటలు వినబడుతున్నవి. మారిన సీఎం రేవంత్, మారని కేసీఆర్ భవిష్యత్ వ్యూహాలు కాచివడపోస్తున్నారు. కేటీఆర్ దూకుడు, కేటీఆర్ స్ఫూర్తిగా పాడి కౌశిక్ రెడ్డి లాంటి ఎమ్మెల్యేల దూకుడు బిఆర్ఎస్ పార్టీకి ఏమేరకు ప్రయోజనాలు కలిగిస్తాయో ముందుముందు తెలుస్తుంది.



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

ఫార్ములా ఈకారు రేసు కేసులో ఎ1గా ఉన్న కేటీఆర్ ఇప్పటికే ఎసిబి, తర్వాత ఈడి విచారణకు హాజరయ్యారు. ఈ రెండు విచారణల తర్వాత కేటీఆర్ బయటకు వచ్చి సుదీర్ఘ ప్రెస్ మీట్ లు పెట్టారు. విచారణ అంశాలన్నీ.. కూలంకషంగా చెప్పేశారు. అరపైసా అవినీతి జరగలేదని సమర్ధించుకున్నారు. అనేక సందర్భాలు.. అనేక మీడియా సమావేశాల్లో చెప్పారు. ఇపుడు విచారణ జరుగుతున్న సమయంలో విచారణను ప్రభావితం చేసేలా కాదు.. తానే ఎసిబిని ఫలానా ప్రశ్న అడిగానని, తానే ఈడిని ఇది అడిగానని చెబుతున్నారు. దీంతో అసలు విచారణ చేస్తున్నది కేటీఆరో, లేక ఏసీబీ, ఈడిలో అర్థంకాని స్థితి నెలకొందని సోషల్ మీడియాలో గులాబీసైనికులే కామెంట్లు పెడుతున్నారు. రాజ్యాగబద్దంగా ఏర్పడిన దర్యాప్తుసంస్థల గౌరవం దెబ్బతినేలా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన వారు వ్యవహరించడం సరికాదు. కేటీఆర్ నిజాయితీపరుడు కావొచ్చు.. తప్పులేదని ఆయన భావించొచ్చు. నేరం నిరూపణ అయ్యేవరకు ఎవరైనా నిందితులే కానీ.. నేరస్థులు కాదు. కానీ విచారణ జరిగే సమయంలో ఇలాంటి ప్రవర్తన విచారణ సంస్థలను ప్రభావితం చేయడం కాదా? అన్నది ఆలోచించాలి. కేటీఆర్ రెండు సార్లు విచారణకు హాజరైన సమయంలోనూ.. ఎమ్మెల్యేలు, నేతలతో భారీ బలప్రదర్శనగా వచ్చారు. ఈడి విచారణకు హాజరయ్యే సమయంలో నేతలను అదుపు చేయడానికి పోలీసులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. విచారణకు హాజరయ్యే సమయంలో ఇంత హైప్, హైటెన్షన్ ఏర్పరచడం వల్ల లాభమెవరికి? బిఆర్ఎస్ కోణంలోనే మాట్లాడాల్సి వస్తే ప్రభుత్వ వైఫల్యాలను దారి మళ్ళిస్తున్నది ఎవరు? ఇలాంటి హంగామా కాదా? అని ఆ పార్టీ ముఖ్యుల్లోనే చర్చ ఉంది.

> **ఇపుడు విచారణ జరుగుతున్న సమయంలో విచారణను ప్రభావితం చేసేలా కాదు.. తానే ఎసిబిని ఫలానా ప్రశ్న అడిగానని, తానే ఈడిని ఇది అడిగానని చెబుతున్నారు. దీంతో అసలు విచారణ చేస్తున్నది కేటీఆరో, లేక ఏసీబీ, ఈడిలో అర్థంకాని స్థితి నెలకొంది.**

నేను మారిపోయానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారు. నడతలో.. మాటలో మార్పులు స్పష్టంగా కనబడుతున్నాయి. వివాదాలు విమర్శలకు, ఉద్వేగాలకు దూరంగా ఉంటూ పూర్తి సమయం పాలనకే వెచ్చిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది జనవరి 1 నుండి మారిపోయానని పార్టీ ముఖ్యులకు, ఎమ్మెల్యేలకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. తన పనితీరులోనూ ఆ మార్పును చూపిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా కేసీఆర్ ను, కేటీఆర్ ను పరుషంగా దూషించలేదు. వీలైనంత వరకు వారి ప్రస్తావన లేకుండా పూర్తిగా పరిపాలన, ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలపైనే ఫోకస్ పెట్టారు. ఈనెల 26 నుండి మూడు కీలక పథకాల అమలుకు లక్ష్యాన్ని పెట్టుకున్నారు. దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ను ప్రకటించారు. ఈ మూడు పథకాలను రుణమాఫీ సమయంలో ఎదురైన ఆటంకాలు ఎదురుకాకుండా జాగ్రత్తగా పట్టాలెక్కించాల్సి ఉంది. ప్రభుత్వయంత్రాంగం కసరత్తు చేసి అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకం చేరేలా ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళితేనే ప్రభుత్వానికి మైలేజీ వస్తుంది. ఇంకా రేషన్ కార్డులు ఇవ్వకముందే లబ్దిదారుల జాబితాలపై గ్రామాల్లో అలజడి మొదలైంది. ప్రభుత్వం ఎంతమందికైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా.. ఇలాంటి చర్చలు జరగడం క్షేత్రస్థాయి అధికారుల వైఫల్యమే. బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించి క్రిష్ణాజలాల్లో తెలంగాణ వాటాపై చర్చను సాధించడం పదేళ్ళతెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో సాధించిన విజయం. క్రిష్ణా జలాల్లో తెలంగాణ, ఎపి మధ్య వాటాల వివాదాలు ఉండగా, గత ప్రభుత్వం వివాదాలు కొని తెచ్చుకోవడం తప్ప ఇలాంటి వాటాలు సాధించలేకపోయింది. కేసీఆర్ నీటిపారుదల రంగంపై ఎంతో శ్రద్ధ పెట్టినట్లు కనిపించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నీటివాటాల పరిస్థితి ఉండేది. ఇపుడు హంగూ, ఆర్భాటం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల రంగ నిపుణులతో చర్చించి.. బలమైన వాదనలతోa బ్రిజేష్ ట్రిబ్యునల్ ను ఒప్పించారు. దీని ప్రభావం ఎంతలా ఉందంటే.. గతంలో నీటి పారుదల శాఖా మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కూడా 13నెలల కాంగ్రెస్ పాలన తర్వాత కూడా ఇది కేసీఆర్ విజయమే అంటూ ప్రకటించుకునేంత పురోగతిని కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది.

> **నేను మారిపోయానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారు. నడతలో.. మాటలో మార్పులు స్పష్టంగా కనబడుతున్నాయి. వివాదాలు విమర్శలకు, ఉద్వేగాలకు దూరంగా ఉంటూ పూర్తి సమయం పాలనకే వెచ్చిస్తున్నారు.**

## మారనంటున్న కేసీఆర్

అవిగో ఉప ఎన్నికలు అంటూ తరచూ ప్రకటనలివ్వడం, ఢిల్లీలో కేసులు వేసినట్లు, కేసులు వేస్తున్నట్లు మాట్లాడుతూ ప్రస్తుత బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను, క్యాడర్ ను ఆశావహ పరిస్థితుల్లో ఉంచేందుకు బిఆర్ఎస్ నాయకత్వం ప్రయత్నిస్తోంది. భారీ ఓటమి తర్వాత కూడా గులాబీదళపతి కేసీఆర్ జిల్లాల వారీగా సమీక్షలు గానీ, వివిధ రంగాల నిపుణులను గానీ కలిసి సమీక్ష చేసేందుకు ఇష్టపడడం లేదు. ఓడగొడితే నా వ్యవసాయక్షేత్రంలో కూసొని రెస్ట్ తీసుకుంటా అని ప్రకటించిన కేసీఆర్ అదే పని చేస్తున్నాడని గులాబీ కార్యకర్తలు అంటున్నారు. దేశంలో ఏ రాజకీయనాయకుడూ ఇలా విలక్షణ వ్యవహారశైలి లేదు. ప్రజలకు దూరంగా ఉండి ప్రతిపక్ష పార్టీ రాజకీయం చేయగలదా? ప్రధానంగా ప్రతిపక్ష నేత ప్రజలకు దూరంగా ఉంటే ఆ పార్టీ భవిష్యత్తు అనేది ఖచ్చితంగా ఇబ్బందికరమే. పరిపాలనలో, రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉండవచ్చు. కానీ పడిపోయారు కదా.. పడగొట్టారు కదా. లేవాలంటే నమ్మకం కోల్పోయిన రంగాల్లో తిరిగి విశ్వాసం కల్పించాలి కదా అని ప్రజాస్వామిక వాదులు అంటున్న మాట. ప్రజలు ఎక్కడున్నారని తమ కోసం టార్చ్ లైట్ వేసుకుని వస్తారన్న ప్రకటనల ఆశల్లోనే అధినేత ఉన్నారా? లేక అప్రకటిత విరమణకు సిద్ధపడ్డారా? ఏమైనా పాలకపక్షం, ప్రతిపక్షం కలగలిసి అంశాలపై పోరాటాలు, చర్చలు జరిగితేనే ప్రజాస్వామ్యస్ఫూర్తి కనిపిస్తుంది. ప్రజలకు మేలు కలుగుతుంది. కాంగ్రెస్ లో దానం రాగంపై చర్చ సాగుతోంది. దానం ఆగమవుతారా? దానాన్నే ఆగం చేస్తారా? అన్న చర్చలు కాంగ్రెస్ పార్టీలు సాగుతున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల కాలంలో చేసిన వ్యాఖ్యలు బూమరాంగ్ అయ్యాయి. అధిష్టానానికి జలక్ ఇవ్వాలనుకుని కేసీఆర్, కేటీఆర్ లపై పొగడ్తల జల్లు కురిపించారని, కానీ ఇపుడు ఉన్న కాంగ్రెస్ పార్టీలో పూర్వపు పాచికలు పనిచేయవని నేతలు గుర్తుచేస్తున్నారు. దానం నాగేందర్ మంత్రి పదవి కోరుకుంటున్నారని, ప్రాధాన్యం ఆశిస్తున్నారన్న ప్రచారాలున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసుపై విరుద్ధ ప్రకటన చేయడంపై ప్రభుత్వవర్గాలు ఆగ్రహంగా ఉన్నాయి. దీని ప్రభావం ఉప ఎన్నికకు దారితీసినా ఆశ్చర్యంలేదన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. మొత్తంగా తెలంగాణ పాలిటిక్స్ లో రాజకీయం ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనుండగా, ఈ ఎంపిక కాంగ్రెస్ కు కత్తిమీద సామే. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి బైపోల్ కంటోన్మెంట్ లో కాంగ్రెస్ విజయం సాధించగా, త్వరలో మరిన్ని బైపోల్స్ జరిగే అవకాశాలు కనబడుతున్నాయి.

> **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పనితీరులో మార్పును చూపిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా కేసీఆర్ ను, కేటీఆర్ ను పరుషంగా దూషించలేదు. వీలైనంత వరకు వారి ప్రస్తావన లేకుండా పూర్తిగా పరిపాలన, ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలపైనే ఫోకస్ పెట్టారు. దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల జారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ను ప్రకటించారు. ఈ మూడు పథకాలను రుణమాఫీ సమయంలో ఎదురైన ఆటంకాలు ఎదురుకాకుండా జాగ్రత్తగా పట్టాలెక్కించాల్సి ఉంది. ప్రభుత్వయంత్రాంగం కసరత్తు చేసి అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకం చేరేలా ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళితేనే ప్రభుత్వానికి మైలేజీ వస్తుంది.**

**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# కాఫీకి నో చెప్పండి



ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది ఇష్టపడే పానీయం.. కాఫీ! రోజును ప్రారంభించాలంటే.. వేడి వేడి కాఫీ ఉండాల్సిందే! ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే దాకా రోజుకు రెండుమూడు కప్పులైనా లాగించాల్సిందే! అయితే.. ఇదంతా సాధారణ మహిళల విషయంలోనే! 'గర్భధారణ సమయంలోనూ ఇలా కప్పులకు కప్పులు కాఫీని జుర్రేస్తామంటే సమస్యే!' అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కాబోయే తల్లులు అతిగా కాఫీ తాగడం.. అనేక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుందని హెచ్చరిస్తున్నారు.

కాఫీలో ఉండే 'కెఫీన్'.. నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. మితంగా తీసుకుంటే ఫరవాలేదు. ఎక్కువైతేనే ఇబ్బంది. అందులోనూ గర్భధారణ సమయంలో మహిళలు కెఫీన్‌ను ఎక్కువ మొత్తంలో తీసుకుంటే.. కడుపులోని బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం పడుతుందట. కెఫీన్‌ను సమర్థంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేకపోవడమే ఇందుకు కారణమని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా.. అధిక మొత్తంలో కెఫీన్ కడుపులో చేరితే, శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందట. మెదడు సర్క్యూట్లకు కెఫీన్ అంతరాయం కలిగిస్తుందని న్యూరోఫార్మకాలజీ జర్నల్ పరిశోధనలో తేలింది. ఫలితంగా, భవిష్యత్‌లో బిడ్డ ఇబ్బందులు పడే ప్రమాదం కూడా ఉంటుంది. గర్భంలో అధిక స్థాయిలో కెఫీన్ చేరడం వల్ల.. శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్ యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని మరికొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గర్భాశయంతోపాటు మావిలోని రక్త నాళాలు సంకోచించడానికి కెఫీన్ కారణమవుతుందని పరిశోధకులు గుర్తించారు. ఫలితంగా, పిండానికి రక్త సరఫరా తగ్గించడంతోపాటు పెరుగుదలనూ నిరోధిస్తుందని హెచ్చరిస్తున్నారు. పిండంలో హార్మోన్లపైనా ప్రభావం చూపుతుందనీ, పుట్టిన తర్వాత పిల్లలు వేగంగా బరువు పెరిగే ప్రమాదం ఉందనీ అంటున్నారు. ఇక గర్భధారణ సమయంలో.. ప్రశాంతమైన నిద్ర అవసరం. కెఫీన్‌ను ఎక్కువగా తీసుకుంటే.. నిద్రకు ఆటంకం కలుగుతుంది. నిద్రలేమితో అలసట, ఒత్తిడితోపాటు ఇతర ఇబ్బందులూ కలిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

## ఇలా అయితే.. ఫర్వాలేదు!

కాఫీ తాగే అలవాటును వదులుకోలేని గర్భిణులకు నిపుణులు కొన్ని సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ అబ్‌స్టెట్రిషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ ప్రకారం.. గర్భిణులు రోజుకు 200 మిల్లీగ్రాముల దాకా కెఫీన్ తీసుకోవచ్చని చెబుతున్నారు. అయినప్పటికీ.. కాఫీ రకం, బ్రూయింగ్ పద్ధతిని బట్టి కెఫీన్ పరిమాణం మారుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అంటున్నారు. రోజుకు రెండుమూడు కప్పులు కాకుండా.. ఒకటి మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక కాఫీ కప్పు సైజును తగ్గించడం కూడా మంచి ప్రభావం చూపుతుంది. లేకుంటే, కెఫీన్ రహితమైన కాఫీ రకాలతోపాటు గ్రీన్ టీ, హెర్బల్ టీలను ప్రయత్నించాలని చెబుతున్నారు.

# హైదరాబాద్ గాలి మళ్ళింది




**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ గాలి మళ్ళింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు కంచుకోటగా, లోక్ సభలో కాషాయ అడ్డాగా మారిన హైదరాబాద్ సిటీ గాలి ఇపుడు మళ్ళింది. సీఎం సాబ్ కు సిటీ సీటీ కొడుతోంది. రేవంతన్న బాగానే చేస్తుండు అని మెజారిటీ ప్రజలు, ప్రధానంగా సామాన్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హామీల ఆశలు ఉన్నా.. ప్రభుత్వం ఫర్వాలేదని, పేదల కోసం సీఎం కొట్లాడుతున్నడని సామాన్యప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇంటెలిజెన్స్ నివేదికలకు తోడు తాజాగా సిప్యాక్, టుడే చాణక్య వంటి సంస్థలు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించాయి. ఈ సర్వేలలో కాంగ్రెస్ పార్టీ తాను బలహీనమనుకున్న కొత్తప్రాంతాల్లో పుంజుకుంది. గతంలో బలపడ్డ ప్రాంతాల్లో కొంత ఇబ్బంది పడుతోంది. ఓవరాల్ గా సీఎంకు సామాన్యప్రజలు మంచి మార్కులే వేస్తున్నారు. ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం కొన్నిచోట్ల నారాజ్ ఉంది. హైడ్రా తో చెరువుల కబ్జాలను అరికడుతుండడం, సామాన్యుడికి అన్యాయం జరిగితే పెద్దోళ్ళని చూడకుండా అల్లు అర్జున్ లాంటి స్టార్ ను కూడా అరెస్ట్ చేయడం, ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గకుండా నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయం వైపు నిలబడతాడని ప్రజలు భావిస్తున్నారు.

## ఇప్పటికిపుడు ఎన్నికలు జరిగితే..

హైదరాబాద్ సిటీలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చిన ఎమ్మెల్యేలపై పార్టీ థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా సర్వే నిర్వహించింది. ఇందులో పటాన్ చెరు, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని తేలింది. పటాన్ చెరు నుండి మహిపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి నుండి అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ నుండి ప్రకాష్ గౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో కూడా లోక్ సభ కంటే కూడా ఇపుడు కాంగ్రెస్ బలపడింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోటీ ఉన్నా.. డేంజర్ లో లేదని అధిష్టానం భావిస్తోంది. జీహెచ్ఎంసి ఎన్నికలు త్వరలో రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ కు తాజా సర్వేలు ఊరటనిస్తున్నాయి. సిప్యాక్ సర్వేలు పటాన్ చెరు, శేరిలింగంపల్లి కాంగ్రెస్ కు, మిగతా రెండు బిఆర్ఎస్ తో పోటాపోటీ ఉన్నట్లు పేర్కొన్నాయి. టుడే చాణక్య సర్వేలో మూడు నియోజకవర్గాలు పటాన్ చెరు, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ కాంగ్రెస్ పరం కానున్నాయి. సిటీ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ, లోక్ సభ తో పోలిస్తే ఓవరాల్ గా సిటీ వాతావరణం పూర్తిగా మారినట్లు కనబడుతోంది. బిజెపి అనూహ్యంగా డౌన్ కాగా, బిఆర్ఎస్ కూడా చాలా డౌన్ అయినట్లు సర్వేలు తెలుపుతున్నాయి. కేటీఆర్ పై కేసులు, బిఆర్ఎస్ నేతల నైరాశ్యం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తలపెట్టిన హైడ్రా, మూసీ ప్రక్షాళనలకు అనుకూలత పెరుగుతోంది. ప్రధానంగా మధ్యతరగతి, పేద వర్గాల్లో క్రమంగా ముఖ్యమంత్రి రేవంత్ పట్ల సానుకూలత పెరుగుతోంది. జీహెచ్ ఎంసి ఎన్నికల్లో ఇది కలిసొచ్చే అంశమే. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే అనుకూలత పెరిగే అవకాశాలున్నాయి.

# ప్రపంచ ఆర్థిక సదస్సులో బ్రాండ్ ఏపీకి ప్రమోషన్

## దావోస్ పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు

**డబ్ల్యుఈఎఫ్ లో ప్రపంచ బిజినెస్ దిగ్గజాలతో సీఎం సమావేశాలు**

**కొత్త పాలసీలు, రాష్ట్ర అనుకూలతలు వివరించి పెట్టుబడిదారులకు ఆహ్వానం**

**ఆదివారం రాత్రి 1.30 గంటకు ఢిల్లీ నుంచి జ్యూరిచ్ కు ముఖ్యమంత్రి బృందం**

**నాలుగు రోజుల పర్యటన.. డబ్ల్యుఈఎఫ్ సెషన్స్‌లో, చర్చా కార్యక్రమాలు**

**అమరావతి, మహా :** బ్రాండ్ ఏపీ ప్రమోషన్ తో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు వెళుతున్నారు. ప్రపంచ బిజినెస్ దిగ్గజాలు వచ్చే ఈ సదస్సులో భాగస్వాములు అవ్వడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దేశానికి సంబంధించి పలు దిగ్గజ సంస్థలతో పాటు గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు కూడా ఇప్పటికే ఏపిలో పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, పారిశ్రామిక దిగ్గజాలతో ఉన్న పరిచయాలు, గతంలో సాధించిన విజయాలు కారణంగా 7 నెలల కాలంలోనే పెద్ద సంఖ్యలో పెట్టుబడుల వచ్చాయి. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తల్లో నమ్మకాన్ని కల్గించిన చంద్రబాబు పెట్టుబడుల విషయంలో ఒక పాజిటివ్ వాతారణాన్ని తీసుకు రాగలిగారు. దీంతో దేశంలోని ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటి వరకు రూ. 4 లక్షల కోట్ల కు పైగా పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. వీటిలో కొన్ని ప్రాజెక్టులకు ఇప్పటికే శంకుస్థాపనలు కూడా జరిగాయి. రానున్న రోజుల్లో అర్ ఎల్ ఆర్ మిత్తల్ స్టీల్ పరిశ్రమ, బిబీపీసీఎల్ వంటి ప్రాజెక్టుల పనులు కూడా ప్రారంభం కానున్నాయి.

**జాబ్ ఫస్ట్ విధానం**

ఎన్నికల్లో ప్రకటించినట్లు 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల సాధన లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 20 లక్షల ఉద్యోగ, ఉపాధి కల్పన టాస్క్ ఫోర్స్ కు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పెట్టు బడుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల పోటీని తట్టుకుని నిలబడేందుకు ప్రభుత్వం దాదాపు 15కు పైగా కొత్త పాలసీలను ప్రకటించింది. జాబ్ ఫస్ట్ విధానంతో తెచ్చిన ఈ కొత్త పాలసీలతో పెట్టుబడుదారులను ఆకర్షిస్తోంది. ఇండస్ట్రియల్ డవల్మెంట్ పాలసీ, ఎంఎస్ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎలక్ట్రానిక్ పాలసీ, ప్రైవేటు పార్క్ పాలసీ, క్లీన్ ఎనర్జీ పాలసీ, సెమికండ్టర్ పాలసీ, డ్రోన్ పాలసీ, డాటా సెంటర్ పాలసీ,స్పోర్ట్స్ పాలసీలు, టూరిజంకు పరిశ్రమ హోదా వంటి నిర్ణయాల ద్వారా పెట్టుబడుల కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ అంశాలను దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ప్రముఖంగా ప్రస్తావించి పెట్టుబ



బడుల కోసం నెట్వర్క్ చేయాలనేది ముఖ్యమంత్రి ఆలోచనగా ఉంది. రాష్ట్రంలో ఉన్న మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ రాయితీలు, సమర్ధవంతమైన నాయకత్వం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను వివరించడం ద్వారా జాతీయ అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించేందుకు సిఎం దావోస్ పర్యటనను వేదికగా చేసుకోబోతున్నారు.

**రాత్రి ఢిల్లీ నుంచి జ్యూరిచ్ కు సీఎం బృందం**

ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం అమరావతి నుంచి దావోస్ ప్రర్యటనకు వెళ్లనున్నారు. సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి ముందుగా ఢిల్లీ చేరుకుంటారు. ఢిల్లీ నుంచి అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో తన బృందంతో జ్యూరిచ్ కు చేరుకుంటారు. ముందుగా జ్యూరిచ్ లో ఉన్న ఇండియన్ అంబాసిడర్ తో భేటీ అవుతారు. అనంతరం హిల్టన్ హోటల్ లో 10 మంది పారిశ్రామిక వేత్తలతో సమావేశం అవుతారు. తరువాత అక్కడి నుంచి హోటల్ హయత్ లో తెలుగు పారిశ్రామిక వేత్తలతో సమావేశంలో పాల్గొంటారు. మీట్ అండ్ గ్రీట్ విత్ తెలుగు డయాస్పోరా పేరుతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులపై వారితో చర్చిస్తారు. ఎపిని ప్రమోట్ చేయడం, పెట్టుబడులకు వారిని ఆహ్వానించడంపై సమావేశంలో చర్చిస్తారు. అక్కడ నుంచి 4 గంటల పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించి దావోస్ చేరుకుంటారు. తొలి రోజు రాత్రి పలువురు పారిశ్రామిక వేత్తలతో డిన్నర్ మీటింగ్ లో సిఎం పాల్గొంటారు. తరువాత అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ తో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు. తొలి రోజు సమావేశాలు ముగించుకుని హోటల్ కు చేరుకుంటారు. రెండవ రోజు సిఐఐ సెషన్ లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చలో పాల్గొంటారు. తరువాత సోలార్ ఇంపల్స్, కోకకోలా, వెల్ స్పన్, ఎల్ జి, కార్ల్స్ బర్గ్, సిస్కో, వాల్ మార్ట్ ఇంటర్ నేషనల్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ వంటి సంస్థల సీఈవోలతో, ఛైర్మన్ లతో రెండో రోజు ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. యుఎఈ ఎకానమీ మినిస్టర్ అబ్దుల్లా బిన్ తో సిఎం సమావేశం అవుతారు. అనంతరం వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహిస్తున్న ఎనర్జీ ట్రాన్సిషన్ : వేర్ పబ్లిక్ పాలసీ మీట్స్ ప్రైవేట్ గోల్స్ అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొంటారు. అనంతరం ది నెక్స్ట్ వేవ్ పైనీరింగ్ ది బ్లూ ఎకానమీ ఆఫ్ టుమారో అనే చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు. రెండో రోజు ఈ భేటీలతో పాటు వివిధ జాతీయ అంతర్జాతీయ మీడియా సంస్థలు నిర్వహించే చర్చా కార్యక్రమాల్లో సిఎం పాల్గొంటారు. బ్లూమ్ బర్గ్ వంటి మీడియా సంస్థలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇవ్వడం ద్వారా ఎపి పాలసీల గురించి వివరిస్తారు. మూడవ రోజు కూడా పలు బిజినెస్ టైకూన్ లతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. రోజుకు కనీసం పదికిపైగా భేటీలు, సమావేశాల్లో చంద్రబాబు పాల్గొనబోతున్నారు. నాలుగవ రోజు ఉదయం దావోస్ నుంచి జ్యూరిచ్ కు చేరుకుని అక్కడి నుంచి స్వదేశానికి రానున్నారు. షెడ్యూల్ మీటింగ్స్ తో పాటు... నాలుగు రోజుల సమయంలో పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో ప్రత్యేక సమావేశాల్లో ముఖ్యమంత్రి బృందం పాల్గొంటుంది. సిఎం బృందంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఐటీ మంత్రి నారా లోకేష్ తో పాటు ఇండస్ట్రీ శాఖ అధికారులు, ఇడిబి అధికారులు ఉన్నారు.

# తెలుగు జాతి కీర్తి ప్రతీక ఎన్టీఆర్ 29వ వర్ధంతి రక్తదాన శిబిరం

**హైదరాబాద్, జనవరి 18, మహా:** తెలుగు జాతి ఆత్మ గౌరవ ప్రతీక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుసంధానంగా సామాజిక సేవను కొనసాగించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యులు బక్కిన నరసింహులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్, జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర అధ్యక్షులు హరికృష్ణ, కోటి చౌదరి మాట్లాడారు. వారు ఎన్టీఆర్ ఆశయాలను ఉద్దేశించి ప్రజల సేవకు ఎన్టీఆర్ ట్రస్ట్ చేసే కృషిని ప్రస్తావించారు. రక్తదానం ద్వారా ఎన్నో మంది జీవితాలను రక్షించడమే కాకుండా ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో పాల్గొనడం ప్రతిఒక్కరికి గర్వకారణమని నేతలు అభిప్రాయపడ్డారు. తెలుగు జాతి గర్వకారణ



మైన ఎన్టీఆర్ జ్ఞాపకాలను చిరస్మరణీయంగా నిలిపేందుకు, ఎన్టీఆర్ ట్రస్ట్ చేపట్టే ఈ తరహా కార్యక్రమాలు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చినవారి సంఖ్య ఆశాజనకంగా ఉంది. రక్తదానం చేసే ప్రతి వ్యక్తి ఎన్టీఆర్ ఆశయాలకు కొండంత బలం చేకూరుస్తున్నారని కార్యక్రమ నిర్వాహకులు అభినందించారు.



ఏఎన్ఎన్ తెలుగు న్యూస్ ఛానల్, మహా పత్రిక డైరీ 2025ని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి శనివారం అందజేసిన బ్యూరో చీఫ్ గడ్డం కృష్ణమూర్తి



## చంద్రబాబు ఇంటికి అమిత్ షా

**అమరావతి, మహా : ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా వచ్చారు. అమిత్ షా కు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ స్వాగతం పలికారు.**

# మంత్రి నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పోస్ట్ ఇవ్వాలి

## చంద్రబాబుకు కడప జిల్లా టిడిపి అధ్యక్షుడు, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి..

**కడప :** ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌పై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి లోకేశ్‌ని ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేయాలని శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మైదుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆయన కోరారు. రాష్ట్రాభివృద్ధి కోసం లోకేశ్ చేస్తున్న కృషిని గుర్తించాలని అభ్యర్థించారు. అన్ని రకాలుగా యువతను పోత్సహించే విధంగా ఐటీ, పారిశ్రామిక రంగాలకు చెందిన అనేక పరిశ్రమలను ఏపీకి తెచ్చేందుకు లోకేశ్ విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో పార్టీకి, యువతకు




భరోసా ఇవ్వాలంటే లోకేశ్‌ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలంటూ సీఎం చంద్రబాబు ఎదుట శ్రీనివాసరెడ్డి ప్రతిపాదనలు పెట్టారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

**విశాఖ ,పెందుర్తి ,మహా :** పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా జీవిస్తారని పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ప్రజలకు తెలియజేశారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి సమీపంలో చిన్నముసిడివాడ సత్య నగర్ కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పంచకర్ల ప్రారంభించారు. 97 వార్డు టిడిపి కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజలు భాగస్వామితోనే . పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ,జీవీఎంసీ జోనల్ కమిషనర్ హైమావతి పాల్గొన్నారు.



# గాజువాకలో పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం

## స్టీల్ ప్లాంట్‌కి నిధులు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసిన కార్యకర్తలు



**విశాఖ ,గాజువాక ,మహా :** విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్రం 11వేల 440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు గాజువాక జనసేన పార్టీ నాయకులు క్యాండిల్ జంక్షన్ వద్ద పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో గాజువాక జనసేన పార్టీ ఇంచార్జ్ కోనతాతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంలో కీలకపాత్ర వహించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు గాజువాక ప్రజల తరపున స్టీల్ ప్లాంట్ కార్మికుల తరపున, గాజువాక జనసేన పార్టీ కార్యకర్తల తరపున ధన్యవాదాలు తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తావని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో మొట్టమొదటి వ్యతిరేకించిన పవన్ కళ్యానే అని గుర్తు చేశారు.ఢిల్లీ వెళ్లి మోడీ, అమిత్ షాతో , విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడటం జరిగిందని పేర్కొన్నారు. గతంలోస్టీల్ ప్లాంట్ ఉద్యమంలో 3 లక్షల మందితో కూర్మన్నపాలెం ఆర్చి వద్ద బహిరంగ సభ నిర్వహించారన్నారు. స్టీల్ ప్లాంట్ ను కాపాడుతానని చెప్పి ఆ దిశగా మా అధినేత పవన్ కళ్యాణ్ అడుగులు వేస్తున్నారని చెప్పారు.స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జనసేన నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రోలో గుండె తరలింపు

## గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసిన మెట్రో సంస్థ



**హైదరాబాద్,మహా:** గుండె ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ కోసం చేపట్టిన ప్రక్రియలో.. హైదరాబాద్ మెట్రో కీలక పాత్ర పోషించింది. నగరంలోని ఎల్‌బీనగర్‌లో ఉన్న కామినేని ఆస్పత్రి నుంచి దాత గుండెను.. లక్డీకపూల్ లో ఉన్న గ్లెనిగేల్స్ గ్లోబల్ ఆస్పత్రికి అత్యంత వేగంగా తరలించారు. దీని కోసం హైదరాబాద్ మెట్రో సంస్థ గ్రీన్‌కారిడార్‌ను ఏర్పాటు చేసింది. ఎటు వంటి ఆటంకాలు, ఆలస్య లేకుండా.. అతివేగంగా దాత గుండెను ట్రాన్స్‌పోర్ట్ చేసింది. గ్రీన్ కారిడార్ ద్వారా సుమారు 13 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 13 నిమిషాల్లోనే చేరుకున్నారు. ఈ రూట్లో 13 స్టేషన్లు దాటేశారు.హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. గుండె తరలింపులో ఆలస్యం కావొద్దు అన్న ఉద్దేశంతో మెట్రో రైలులో దాన్ని పంపింపారు. శుక్రవారం రాత్రి 9.30 నిమిషాల సమయం లో మెట్రో రైలు ద్వారా డోనార్ గుండెను తరలిం చారు. చాలా సునిశితమైన ప్లానింగ్, మెట్రో రైలు.. వైద్యులు, ఆస్పత్రి వర్గాల సహకారంతో ఆ ప్రయత్నం సఫలమైనట్లు తెలుస్తోంది.

# విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పులు కట్టలేని స్థితిలో ఉంది

## మాజీ మంత్రి వైసిపి జిల్లా అధ్యక్షుడు అమర్ నాద్

**విశాఖ ,మహా :** విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పులు కట్టలేని పరిస్థితిలో ఉందని వై.ఎస్.ఆర్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ నాద్ అన్నారు స్టీల్ ప్లాంట్ ను కాపాడాలని ఉద్దేశ్యం ఉంటే ప్రైవేటీకరణ జరగదని ఎందుకు చెప్పలేదని ,.ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నించారు.కేంద్రం ఇచ్చే ప్యాకేజీ అప్పులకే సరిపోతుందన్నారు.ప్లాంట్ లో విఆర్ఎస్ ను ఎందుకు తీసుకువచ్చారన్నారు.25 వేల మందితో నడవాల్సిన ప్లాంట్ 10 వేల మందితో నడుస్తుందని చెప్పారుఇంకా ఉద్యోగులను తొలగిస్తే ప్లాంట్ ఎలా నడుస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు సెంట్ మెంట్ తో స్టీల్ ప్లాంట్ ఏర్పడిందన్నారు.55 వేల కోట్లు పన్నుల రూపంలో కట్టారన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ముందు నాలుగు డిమాండ్స్ పెడుతున్నామని పేర్కొన్నారు.స్టీల్ ప్లాంట్ కు టాక్స్ హాలిడే ఇవ్వాలి.ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చెయ్యాలి. సొంతంగా గనులు కేటాయించాలి.200 ఏళ్లకు సరిపడే గనులు కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయి.. రాష్ట్రపతి పేరు మీద ఉన్న స్టీల్ ప్లాంట్ భూములు స్టీల్ ప్లాంట్ పేరు మీద మార్చాలి.అని డిమాండ్ లని వివరించారు.కూటమి పాలన వచ్చిన తర్వాత స్టీల్ ఉద్యోగుల కు జీతాలు ఇవ్వలేదన్నారు.

# ఇది నిజంగా అద్భుతమే.. పుట్టిన కాసేపటికే పునర్జన్మ

## దైవ పరీక్షా..? మానవ మహత్యమా..?.. అప్పుడే పుట్టిన శిశువుకు సీపీఆర్



**హైదరాబాద్, మహా :** కొన్ని సన్నివేశాలు చూస్తుంటే.. ఇది దేవుడు పెట్టే పరీక్షా..? విధి అడే వింత నాటకమా..? మానవుని మహత్యమా..? అనే అనుమానం కలుగుతుంటుంది. అచ్చంగా అలాంటి సందర్భమే ఎదురైంది. నవమాసాలు తల్లిగర్భంలో ఉన్న శిశువు అప్పుడే బయటకు వచ్చి నేను వచ్చేశానంటూ కేర్ కేర్ మంటూ ఏడుస్తూ అందరికీ వినిపించేలా చెప్పింది. ఆ శిశువు ఏడుపు వినగానే ప్రపంచాన్ని జయించినంత ఆనందంతో ఆ తల్లి ముఖం వెలిగిపోయింది. అప్పటి వరకు పడిన పురిటినొప్పుల బాధనంతా ఆ బుజ్జాయి స్పర్శతో పూర్తిగా మర్చిపోయింది. మహాలక్ష్మి పుట్టిందన్న విషయం తెలియగానే ఆ కుటుంబ సభ్యులంతా సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎప్పుడెప్పుడు ఆ చిన్నారిని చేతుల్లోకి తీసుకుని ముద్దాడదామా అని ఆతృత అందరి కళ్లలో కనిపిస్తోంది. కానీ.. వాళ్లందరినీ కాలం పరీక్షించాలనుకుందో ఏమో పెద్ద పరీక్షే పెట్టింది. అప్పుడే పోసుకున్న ప్రాణం ఊపిరందక విలవిల్లాడిపోయింది. చూస్తున్నంతలోనే.. ఆ చిన్ని గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. ఈ ఊహించని పరిణామం చూసి అప్పటివరకు ఆనందంలో ఉన్న కుటుంబసభ్యులంతా ఒక్కసారిగా హతాశులయ్యారు. ప్రాణం పోసినట్టే పోసి అంతలోనే ఆయువు తీసేశావేంటయ్యా అంటూ దైవాన్ని దీనంగా నిందించటం మొదలుపెట్టారు. ఆ తల్లి కళ్లలో ఆనందాన్ని అర నిమిషమైనా ఉండనివ్వకుండా కన్నీళ్లు నింపేస్తావా అంటూ ప్రశ్నిస్తున్నారు. అందరి గుండెలు బాధతో బరువైన సమయంలో మరో అనుకోని అద్భుతం జరిగింది. చనిపోయిందనుకున్న ఆ చిన్నారి మళ్లీ ఊపిరి పీల్చుకుంది. ఆగిపోయిందనుకున్న ఆ చిన్ని గుండె మళ్లీ కొట్టుకుంది. ఈ అద్భుతం.. మెదక్ జిల్లాలో జరిగింది. మెదక్ ప్రభుత్వాసుపత్రిలో ఓ గర్భిణీ పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన కాసేపటికే ఉన్నట్టుండి పాప ఊపిరి తీసుకోవటంలో తీవ్రంగా ఇబ్బంది పడింది. చేతుల్లో ఇమిడిపోయే ఆ పసిప్రాణానికి ఊపిరందక అల్లాడిపోయింది. పరీక్షించిన వైద్యులు శివువు పరిస్థితిని అంచనావేసి మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. హుటాహుటిన అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు బయలుదేరగా.. మార్గమధ్యలోనే పాప గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. అది కూడా తల్లిదండ్రులకు కూడా ఊపిరాగిపోయినంత పనైంది. పాపను గమనించిన 108 అంబులెన్స్ టెక్నీషియన్ రాజు సమయస్ఫూర్తితో వ్యవహరించాడు. ముక్కుపచ్చలారని ఆ శిశువుకు వెంటనే సీపీఆర్ చేశాడు. దీంతో.. ఆ చిన్ని గుండె మళ్లీ కొట్టుకోవటం ప్రారంభించింది. దీంతో ఆ చిన్ని ప్రాణానికి ఆ అంబులెన్స్ టెక్నీషియన్ మరోసారి ప్రాణం పోశాడు. ఆ శిశువును నీలోఫర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. సరైన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి పాపకు సీపీఆర్ చేసిన టెక్నీషియన్ రాజును వైద్యులు, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఫేక్ కరెన్సీ సప్లై చేస్తున్న కామెరూన్ దేశస్థుడు అరెస్ట్

## రూ.5 లక్షలు ఒరిజినల్ ఇస్తే 10 లక్షలు ఫేక్ కరెన్సీ

### ఫేక్ కరెన్సీ కూడా ఇవ్వకుండా మోసం చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు



**ఎల్బీనగర్, జనవరి 18,మహా:** నగరంలో ఫేక్ కరెన్సీ సప్లై చేస్తున్న ఇద్దరు ముఠా సభ్యులలో ఒకరిని హయత్ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు.హయత్ నగర్ ఇన్స్ పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం కామెరూన్ దేశానికి చెందిన జాక్వస్ డివోలిస్ కిట్ (42)గత 2017 జులైలో టూరిస్ట్ వీసాపై ఇండియాకు వచ్చాడు.టూరిస్ట్ వీసా మీద వచ్చిన ఈ నిందితుడు తిరిగి కామెరూన్ కు వెళ్లకుండా బెంగళూర్ లోని శాంతినగర్ లో ఉంటూ ఇండియన్ ఫేక్ కరెన్సీ సప్లై చేస్తున్నాడు.దీంతో 2020లో బెంగళూర్ లో ఓ వ్యక్తికి ఇండియన్ కరెన్సీ ఇస్తే దానికి డబుల్ నకిలీ ఇండియన్ కరెన్సీ ఇచ్చేట్లు చెప్పి అతన్ని చీట్ చేసి డబ్బులతో ఉడాయించాడు. దీంతో హెన్నూర్ పోలీస్ స్టేషన్ లో దొంగతనంగా దేశంలో నివాసం ఉంటున్నట్లు ఫారెనర్ కేసు,ఫేక్ కరెన్సీ సప్లై కేసు నమోదు చేసిన పోలీసులు జాక్వస్ డివోలిస్ ను రిమాండ్ కు తరలించారు. అప్పటికి కూడా తన ఫ్రెండ్ వేశాను తనదిగా చూపుతూ ఫేక్ వీసా మీద దేశంలో తిరుగుతూ ఫేక్ మనీ సప్లై బిజినెస్ చేస్తున్నాడు.దీంట్లో భాగంగానే శుక్రవారం సిటీకి వచ్చి హయత్ నగర్ లోని హయత్ నగర్ లోని చైత్ర ఒయో లాడ్జ్ లో ఉన్నాడు.సిటీకి చెందిన రసూల్ అనే వ్యక్తితో ఫేక్ కరెన్సీ సప్లై చేసేటట్టు ఒప్పందం కుదుర్చుకుని బిజినెస్ విషయం మాట్లాడుకునేందుకు వచ్చాడు.రసూల్ ఇచ్చిన సమాచారంతో హయత్ నగర్ పోలీసులు జాక్వస్ డివోలిస్ ను అదుపులోకి తీసుకొని విచారించగా ఫేక్ వీసాపై ఇండియాలో ఉంటున్నట్లు గుర్తించారు.నగరానికి ఫేక్ కరెన్సీ సప్లై చేసేందుకు డీల్ కుదుర్చుకోవాలి అని రసూల్ అనే వ్యక్తితో మాట్లాడుకొని డీల్ సెట్ చేసుకునేందుకు వచ్చాడని రసూల్ ఇచ్చిన సమాచారంతో అరెస్ట్ చేసి శనివారం రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.ఈ నిందితుడు ఫేక్ కరెన్సీ కూడా అప్పగించకుండా మోసం చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.నమ్మించి ఒరిజినల్ కరెన్సీ తీసుకెళ్లిన ఇలాంటి వాటిని నమ్మి ఎవ్వరు కూడా ఇబ్బందులు పడొద్దని పోలీసులు హెచ్చరించారు.పాస్ పోర్ట్,మొబైల్ ఫోన్ సీజ్ చేశారు.

# రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నాం

## నాగోల్ ఆర్టీఓ ఆఫీస్‌లో డ్రైవర్లకు ఫ్రీకంటి పరీక్షలు

### హాజరైన రవాణాశాఖ జాయింట్ కమీషనర్ సి. రమేష్

### డ్రైవర్లచే రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించిన జేటిసి



**ఎల్బీనగర్, జనవరి 18, మహా:** రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత పడాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని ప్రమాదం జరిగిన సమయంలో ప్రమాదానికి కారకులతో పాటు అమాయకులు కూడా బలి అవుతున్నారని జాయిట్ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ సి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నెల 1నుండి 31వరకు జరువుతున్న రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగ నాగోల్ ఇంచార్జ్ ఆర్టీఓ అమర్నాధ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు శనివారం కంటిపరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి కళ్ళజోడు అందించారు.డ్రైవర్లతో కలిసి జాయిట్ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ రమేష్ కూడా కంటి పరీక్ష చేయించుకున్నారు.అనంతరం డ్రైవర్లతో రోడ్డు భద్రతా ప్రతీజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి,ట్రాన్స్ పోర్ట్ మినిస్టర్ పొన్నాం ప్రభాకర్ ఆదేశాలతో ఈ నెల 1 నుండి 31వరకు ప్రతీరోజు రోడ్డు భద్రతపై ఏదో ఓ కార్యక్రమం చేస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.డ్రైవర్లకు కంటి చూపు చాలా ముఖ్యమైనదని అదే ఉదేశ్యంతో ఈ ఐ టెస్ట్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నిర్లక్ష్యంతో చేసే డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది మృతి చెందుతున్నారు అని చెప్పారు.యువకులకు రోడ్డు భద్రతపై అవగాహన, ఆర్టీసీ,ఆటోడ్రైవర్లకు సదస్సులను ఏర్పాటు చేసి ప్రమాదాలను ఆరికట్టడం ,ఆతివేగం వల్ల ఓ కుటుంభ పెద్ద మరణిస్తే ఆ తర్వాత ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుందనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాగోల్ ఇంచార్జ్ ఆర్టీఓ కె అమర్నాధ్, అధికారులు అనిత,శీతల్,బలరాం,జ్ఞానేశ్వర్,అభిలాష్,ప్రసాద్,వేణు, నాగేశ్వర్ రావు,ప్రతీష్ రెడ్డి,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు



**మహా, పరిగి వికారాబాద్ జిల్లా :** రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. జనవరి ఒకటవ తేదీ నుండి 31 జనవరి వరకు జరిగే మాసోత్సవాలలో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. వాటిలో భాగంగా వికాబాద్ జిల్లా పరిగి వాహన చోదకులకు రోడ్డు భద్రతా నియమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది.పరిగి రవాణా శాఖ అధికారి వీరేంద్ర నాయక్ మాట్లాడుతూ దేశంలో గత ఏడాది సగటున 5 లక్షల మంది రోడ్డు ప్రమాదాలకు గురి కాగా, అందులో 1.70 లక్షలమంది, రాష్ట్రంలో 6000 మంది ప్రమాదాల వలన చనిపోవడం జరిగిందని ఆయన తెలిపారు. దీనిని అరికట్టాలంటే వాహన చోదకులు, ప్రయాణికులు,మరియు ప్రజలు అందరూ రోడ్డు భద్రత పైన అవగాహన పెంచుకోవడం వలన, ప్రతి ఒక్కరూ వాటిని పాటించడం వలన సదరు ప్రమాదాలని నివారించవచ్చని ఆయన తెలిపారు. అదేవిధంగా పరిగి లో వివిధ పాఠశాలల్లో కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు భద్రత, రోడ్డు నియమాలు, మరియు వాటి ఉల్లంఘన చర్యల పైన అవగాహన కల్పిస్తూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు అని , మరీ ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ చేయరాదని ,చేసిన యెడల వాహన యజమాని తో పాటు ,వారి తల్లిదండ్రులకి జరిమానా తో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉన్నందున ఇట్టి ఉల్లంఘన చర్యలకు పాల్పడరాదని తెలిపారు. యువత మితిమీరిన వేగంతో,హెల్మెట్ లేకుండా వాహనం నడపడం ,పబ్లిక్ ప్రదేశాలలో రోడ్ల పైన స్టంట్ లు చేయడం వంటివి చేసిన యెడల వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. నేటి యువతరమే భావిభారత భవిష్యత్తు అని ఈ యొక్క రోడ్డు భద్రతలు వీరు పాటించడమే కాకుండా తమ కుటుంబంలోని వ్యక్తులకు చుట్టుపక్కల అందరికి వారికి తెలియజేస్తూ తమ వంతుగా అవగాహన కల్పిస్తూ పాటిస్తూ సహకరించాలని తద్వారా ఎన్నో ప్రమాదాలని మరణాలని నివారించవచ్చు అని అన్నారు, రోడ్డుపై ప్రయాణం మన గమ్యస్థానాలని సురక్షితంగా చేరుకోవడానికే కానీ అదే చివరి ప్రయాణం అయ్యేందుకు కాకూడదని, జాగ్రత్తలు పాటిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, మరి ఎస్ఐ సంతోష్ కుమార్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భర్త కావాలని 14 రోజులుగా భార్య దీక్ష

## హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భూదాన్ కాలనీలో ఘటన

### పెళ్లయిన 9నెలలకే వదిలేశాడని ఆవేదన



**ఎల్బీనగర్, జనవరి18, మహా:** తన భర్త తనకు కావాలని ఓ వివాహిత తన భర్త ఇంటి ముందు బైఠాయించి గత 14రోజుకుగా నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూర్ భూదాన్ కాలనీలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కర్మన్ ఘట్ కు చెందిన మనీషాకు భూదాన్ కాలనీకి చెందిన చెపూరి సాయిచరణ్ చారికి 2022 ఏప్రిల్ 24న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది.పెళ్లయిన 9నెలలకే మనీషాతో అకారణంగా గొడవ పెట్టుకున్న సాయిచరన్ ఆమె అమ్మగారింటికి పంపించేశాడు.దీంతో అప్పటి నుండి తన అత్తగారింటికి మనీషా వచ్చే ప్రయత్నం చేయగా ఆమె భర్త కానీ అత్తమామలు యాక్సెప్ట్ చేయడం లేదు.పెద్దలను తీసుకువచ్చి మాట్లాడిన వారితో కూడా మాట్లాడకుండా సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో తనను తన భర్త భార్యగా ఎందుకు స్వీకరించడం లేదో సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తం చేసింది.అకారణంగా నన్ను దూరం చేశారంది. ఈ నెల 5నుండి మనీషా తన భర్త తనకు కావాలని సాయిచరణ్ ఇంటి ముందు టెంట్ వేసి నిరవధిక నిరాహారదీక్ష చేస్తుంది. శనివారం వరకు ఈ దీక్ష 14వ రోజుకు చేరింది.

# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కోళ్ల వ్యాన్

**సత్తుపల్లి టౌన్, జనవరి 18, మహా.** ఖమ్మం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు గంగారం వద్ద ప్రమాదానికి గురైంది. అశ్వరావుపేట వైపు నుంచి వస్తున్న కోళ్ల వ్యాన్ బస్సును రాసుకుపోయింది. ఈ ఘటనలో బస్సు గ్లాసులు ఒత్తిడికి గురవడంతో గాజు పెంకులు నలుగురికి గుచ్చుకున్నట్లు సమాచారం.ఇజరి గాయాలతో బాధపడుతున్న నలుగురికి సంఘటన స్థలంలోనే స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం ప్రయాణికులను వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు పంపించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 38 మంది ప్రయాణికులు ఉన్నారు. స్వల్పంగా జరిగిన ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదులు నమోదు చేయలేదు.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



**ఇబ్రహీంపట్నం, జనవరి 18 మహా:** సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఇబ్రహీంపట్నం సిపిఎం కార్యాలయంలో వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు 4 రోజుల పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలలో ప్రజా సమస్యలపై సిపిఎం చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను చర్చించి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయవలసిన పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే మతోన్మాద భావజాలానికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యంగా ఉంచి సంఘటితం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూల నుండి ప్రజల అధిక సంఖ్యలో హాజరు అవుతారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరు గ్యారెంటీల్ హామీ ఇచ్చిన స్వేచ్ఛ, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం అమలులో బాధ్యతరాహితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. హామీల అమలు విస్మరించి, ప్రజాస్వామిక హక్కులపై నిర్బంధాలు కొనసాగిస్తే గత బిఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందన్నారు. ఈ మహాసభలలో రైతులు, మహిళలు, కార్మికులు, విద్యార్థి, యువజనులు సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలను, చర్చించి వాటి పరిష్కార మార్గాలను, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. రాష్ట్ర సమగ్రాబివృద్ధి కోసం జరిగే ఈ మహాసభలకు సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్ బీవీ రాఘవులు, విజయ రాఘవన్ తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం 25న జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి బుగ్గరాములు, మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఏల్లేష్, ముసిలయ్య, చెన్నామోని శంకర్, మండల విజయ్, జంగిలి ప్రభుదాసు, బోడ యాదగిరి, ఎర్పుల వీరేష్, చెన్నామోని రాఘవేందర్, సయ్యద్ రజాక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# లారీ బైకును ఢీకొనడంతో ఒకరు మృతి





**మహా, కొడంగల్:** వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట్ మండలం మెట్లకుంట శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. అటువైపుగా వస్తున్న ఐచర్ లారీ బైకు ను ఢీకొనడంతో బైక్ పైన ఉన్న ఇద్దరి వ్యక్తులలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు . ఇంకొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని వెంటనే 108కి సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి వారిని కొడంగల్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి ఫిర్యాదు జరుపుతున్నారు.

# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు .. 2025 రోడ్డు భద్రత పోస్టర్, కరపత్రాల విడుదల.. జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి




**ఇబ్రహీంపట్నం, జనవరి 18 మహా:** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్, సైబరాబాద్ ట్రాఫిక్ కమీషనర్, రాచకొండ ట్రాఫిక్ కమీషనర్, రోడ్స్ అండ్ బిల్డింగ్ అధికారులతో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు -2025, రోడ్డు సేఫ్టీ సంబంధించిన వివిధ విషయాలపై సమీక్షించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి రాచకొండ, సైబరాబాద్ ట్రాఫిక్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మోటారు వాహనాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయి. ఈ నవనాగరిక, ఆధునిక, వేగవంతమైన సమాజము, కంప్యూటర్ యుగములో ప్రతి వ్యక్తికి మోటార్ వాహనము అవసరం తప్పనిసరి అయినదని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితిని గమనించినట్లయితే ప్రతి ఒక్క కుటుంబం కనీసం రెండు వాహనములకు తక్కువగా కలిగి ఉండుట లేదన్నారు. ఈ రద్దీకి తగినంతగా మనము రహదారులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేటి వేగవంతమైన పోటీతత్వ సమాజంలో, మానవ తప్పిదం వలన, సరిపడినన్ని రహదారులు ఉన్నప్పటికి, మోటారు వాహనములను సరియైన కండిషన్లో ఉండకపోవడం వలన, అతివేగముగా వాహనములను నడుపుట వలన వాహన డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరి వలన రహదారిపై ఇతర వాహనదారుల బాధ్యతా రహిత ప్రవర్తన, రహదారి నియమాలను, ట్రాఫిక్ సిగ్నల్స్ ను సరిగా పాటించకపోవుట, అవగాహన లోపము, రోడ్డు ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. జిల్లాలో ప్రతి రోజు ఇలాంటి మరణ వార్తలు దిన పత్రికలలో చూస్తున్నామన్నారు. రహదారి ప్రమాదాల వలన అనేక మంది ప్రజలు మరణిస్తున్నారని, క్షతగాత్రులవుతున్నారని ఎంతో ఆస్తినష్టం జరుగుచున్నదని అన్నారు. మరణాలు జరిగేవి చూసుకుంటే ఎక్కువ శాతం మరణాలు రహదారి ప్రమాదాలే కారణము అవుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల జిల్లాలో అనేక విధాలుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ రోడ్డు ప్రమాదాల వల్ల ఎందరో చనిపోవడం జరుగుతుందని అన్నారు. ఈ రహదారి ప్రమాదాల బారినపడిన వారిపై ఆధారపడిన కుటుంబాలు ఏ ఆధారము లేక రోడ్డుపై అనాథలైపోవుచున్నారు. క్యాన్సర్, ఎయిడ్స్, ఇతర ప్రాణాంతక వ్యాధుల కంటే ఎక్కువగా రహదారి ప్రమాదాలలోనే ప్రాణనష్టం జరుగుచున్నదన్నారు. ప్రపంచంలో నానాటికి సంఖ్య పెరుగుట వలన మరియు శీఘ్రగతిని పారిశ్రామికీకరణ జరుగుతుండడం వలన, వాహనముల సంఖ్య విపరీతముగా పెరుగుట వలన రహదారుల పై రద్దీ అధికముగా ఏర్పడుట వలన పూర్తిగా ప్రమాదాలు సంభవించకుండ చూడటం అసాధ్యం అని అన్నారు. అధికారులుగా మనం కలిసి విధులు నిర్వహిస్తు, అవగాహన కార్యక్రమాలు చేపడితే ప్రమాదాలను చాలా వరకు తగ్గించవచ్చు అని అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల బాగంగా జనవరి 1, 2025 నుండి జనవరి 31, 2025 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లలో విద్యార్థులతో ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదంతో "అమూల్యమైన ప్రజల ప్రాణాలను కాపాడి, ప్రమాద రహిత జిల్లా కొరకు అందరం కలిసి శ్రమిద్దాం" అని తెలిపారు. ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలానికి కమిటీలు చేరుకొని ప్రమాదానికి కారణమైన వివరాలను సేకరించి ప్రత్యామ్నయ చర్యల కోసంపై అధికారులు తెలిపే విధంగా చూడాలన్నారు. సామాజిక బాధ్యతగా వాహనం నడిపేవారందరూ రహదారి భద్రతా నియమాలను సక్రమంగా పాటించాలన్నారు. వాహనాల యజమానులు, డ్రైవర్లు, విద్యార్థులు,ఉద్యోగస్తులు ప్రజానీకము రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, డిఆర్ఓ సంగీత, సంబంధిత అధికారులతో కలిసి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2025 పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సంగీత, జడ్పి సిఇఓ కృష్ణ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, ట్రాఫిక్ అధికారులు, ఆర్టీసి ఆర్ఎమ్, రోడ్స్ అండ్ బిల్డింగ్ అధికారులు, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విప్రోలో 12 వేల ఉద్యోగాలు

**న్యూఢిల్లీ :** దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ విప్రో భారీ స్థాయిలో ఫ్రెషర్లను నియమించుకోవడానికి సిద్ధమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1012 వేల మంది ఫ్రెషర్లను రిక్రూట్ చేసుకోనున్నట్లు ప్రకటించింది. గడిచిన రెండు త్రైమాసికాలుగా భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థ.. మూడో త్రైమాసికంలో 1,157 మంది సిబ్బంది తగ్గారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,32,732కి పరిమితమైనట్లు ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రతి త్రైమాసికంలో 2,5003,000 మంది ఫ్రెషర్లు ఆన్‌బోర్డ్‌లో ఉంటున్నారని కంపెనీ మానవ వనరుల ప్రతినిధి సౌరభ్ గోవిల్ తెలిపారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,354 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే 24.4 శాతం ఎగబాకింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.22,319 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

## పాత ఆదాయం పన్ను చట్టానికి
# ఇక చెల్లు చీటేనా..

### బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయం పన్ను బిల్లు




ఆదాయం పన్ను చట్టం 1961 స్థానంలో కొత్త ఆదాయం పన్ను చట్టం రానున్నదా..? అంటే అవుననే సమాధానమే వస్తోంది. వచ్చే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 'కొత్త ఆదాయం పన్ను బిల్లును ప్రతిపాదించనున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయం పన్ను చట్టాన్ని సరళతరం చేసి కొత్త చట్టం తీసుకొస్తారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేసే పేజీల సంఖ్యను సుమారు 60శాతం తగ్గించి, సమగ్ర ఆదాయం పన్ను చట్టం రూపొందిస్తారు.

**ఆరు నెలల్లో పాత చట్టాన్ని సమీక్షిస్తామన్న నిర్మలమ్మ**

2024 జూలైలో 202425 ఆర్థిక సంవత్సర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఆరు నెలల్లో పాత ఆదాయం పన్ను చట్టం 1961పై సమగ్రంగా సమీక్షిస్తామని ప్రకటించారు. ఈ నెల 31 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లు ప్రవేశ పెడతారు. కొత్త ఆదాయం పన్ను చట్టం రూపొందిస్తారు తప్ప ప్రస్తుత చట్టానికి సవరణలు కాదని అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ముసాయిదా బిల్లు కేంద్ర న్యాయశాఖ పరిశీలనలో ఉంది. మలి విడత బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశ పెడతారని తెలుస్తున్నది.

**31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు**


బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకూ జరుగుతాయి. ఈ నెల 31న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మొదలవుతాయి. తొలుత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకూ కొనసాగుతాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 202526 సంవత్సరానికి బడ్జెట్ సమర్పిస్తారు. మార్చి 10 నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకూ మలి విడుత బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. ఈ బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదిస్తే చట్టంగా మారుతుంది.

**పాత చట్టం సమీక్షకు సీబీడీటీ ఆధ్వర్యంలో కమిటీ**

పాత కాలం నాటి ఆదాయం పన్ను చట్టం 1961పై సమీక్షించి సమగ్ర నివేదిక తయారు చేయడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఒక అంతర్గత కమిటీ నియమించింది. సంక్షిప్తంగా, స్పష్టంగా తేలిగ్గా అర్థం చేసుకునే విధంగా ప్రతిపాదిత బిల్లు ఉంటుంది. వివాదాలు, వ్యాజ్యాలు తగ్గించడానికి పరిష్కార మార్గాలు ప్రతిపాదిస్తారు. పాత ఆదాయం పన్ను చట్టంలోని వివిధ అంశాలను సమీక్షించేందుకు 22 స్పెషలైజ్డ్ సబ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే చట్టం సమీక్షించడానికి ప్రజల నుంచి 6500 సూచనలు వచ్చాయి. ప్రస్తుతం చట్టం 298 సెక్షన్లు, 23 చాప్టర్లు కలిగి ఉంది. ప్రత్యక్ష పన్నులకు సంబంధించిన ఆదాయం పన్ను చట్టం1961లో వ్యక్తిగత ఆదాయం పన్ను, కార్పొరేట్ పన్ను, సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ టాక్స్, గిఫ్ట్ టాక్స్, వెల్త్ టాక్స్ వస్తాయి.

## సోలార్ పవర్‌తో నడిచే
# కారు వేవ్ ఇవా..


పర్యావరణ పరిరక్షణ.. పెట్రోల్-డీజిల్ భారం తగ్గించుకునేందుకు ఆల్టర్నేటివ్ ఫ్యుయల్ వాహనాలు.. ప్రత్యేకించి ఎలక్ట్రిక్, హైబ్రీడ్ వాహనాల తయారీ మొదలైంది. తాజాగా సోలార్ పవర్‌తోనూ నడిచే కారు కూడా వచ్చేసింది. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో వేవ్ మొబిలిటీ శనివారం సోలార్ పవర్‌తో నడిచే తన ఇవా కారును ఆవిష్కరించింది. వేవ్ ఇవా కారు మూడు వేరియంట్లు – నోవా, స్టెల్లా, వెగా వేరియంట్లలో లభిస్తుంది. ఈ కారు ధర రూ.3.25 లక్షల (ఎక్స్ షోరూమ్) ఉంటుంది. కారు సబ్‌స్క్రిప్షన్‌లు ప్రారంభం అయ్యాయి. బ్యాటరీ ధర రూ.3.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) ఉంటుంది. అంటే కారు ధర రూ.6 లక్షల వరకూ పలుకుతుందని భావిస్తున్నారు. ఈ ధరలు తొలి 25 వేల మంది కస్టమర్లకు మాత్రమే పరిమితం అని వేవ్ తెలిపింది. తొలుత 2023 ఎక్స్‌పోలోనే వేవ్ మొబిలిటీ తన సౌర విద్యుత్ వినియోగ కారు ఇవాను ఆవిష్కరించింది. పట్టణ ప్రాంతాల్లో పర్యటించే వారికి సుస్థిరమైన ట్రావెలింగ్ ఆప్షన్‌గా ఈ కారు ఉంటుంది. సింగిల్ చార్జింగ్‌తో 250 కి.మీ దూరం ప్రయాణిస్తుందీ కారు. సౌర విద్యుత్‌తో పని చేయడం వల్ల అదనంగా 3,000 కి.మీ దూరం ప్రయాణించగల సామర్థ్యం కలిగి ఉంటుందీ కారు. వేవ్ ఇవా కారు హై ఓల్టేజ్ పవర్‌ట్రైన్ మోటారుతో వస్తోంది. సూపర్ ఫాస్ట్ చార్జింగ్ సామర్థ్యంతో కేవలం ఐదు నిమిషాల చార్జింగ్‌తో 50 కి.మీ దూరం అదనంగా ప్రయాణించొచ్చు. ఇందులో స్మార్ట్ ఫోన్ ఇంటిగ్రేషన్, ఓవర్ ది ఎయిర్ (ఓటీఏ) అప్‌డేట్స్, రిమోట్ మానిటరింగ్, వెహికల్ డయాగ్నిసిస్ వంటి ఫీచర్లు ఉంటాయి. ఖర్చులు తగ్గించేలా లైట్ వెయిట్ డిజైన్‌తో వస్తోందీ కారు. ఎంజీ కామెట్ ఈవీకి వేవ్ ఇవా గట్టి పోటీ ఇస్తుందని భావిస్తున్నారు. అర్బన్ మొబిలిటీ అవసరాలు తీర్చుకోవడానికి ఉపకరిస్తుంది. సగటున ప్రతి రోజూ 35 కి.మీ దూరం ప్రయాణించొచ్చు. మోడర్న్ ఫ్యామిలీకి కోసం ఇన్నోవేషన్‌తో రూపొందించిన అర్బన్ వెహికల్ ఇది అని వేవ్ మొబిలిటీ సీఈఓ కం కో ఫౌండర్ నీలేశ్ బజాజ్ చెప్పారు.





# దేశం-విదేశం
## NATIONAL-INTERNATIONAL







## అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి..
### బీజేపీ గూండాల పనిగా ఆప్ ఆరోపణ

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధిపతి, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఉన్న వాహనంపై రాళ్లు విసిరారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాల పనిగా ఆప్ ఆరోపించింది. అయితే దీనిని ఆయన ఖండించారు. కేజ్రీవాల్ కారు ఇద్దరు యువకులను ఢీకొట్టిందని విమర్శించారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అలాగే అరవింద్ కేజ్రీవాల్ ఉన్న కారుపై రాళ్లు విసిరారు. అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కారును అక్కడి నుంచి పంపివేశారు. కాగా, అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో ఆప్ పోస్ట్ చేసింది. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపించింది. 'ఓటమి భయంతో బీజేపీ ఆందోళన చెందుతోంది. అరవింద్ కేజ్రీవాల్‌పై దాడికి తన గూండాలను ఉపయోగించింది. అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నప్పుడు బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆయనను గాయపరిచేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా చేయాలనుకున్నారు. బీజేపీ వ్యక్తుల పిరికి దాడికి కేజ్రీవాల్ భయపడరు. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం ఇస్తారు' అని ఎక్స్‌లో పేర్కొంది. మరోవైపు ఆప్ ఆరోపణలను బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ ఖండించారు. అరవింద్ కేజ్రీవాల్ వాహనం ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆరోపించారు. 'ప్రజలు ప్రశ్నలు అడుగుతుండగా, అరవింద్ కేజ్రీవాల్ తన కారుతో ఇద్దరు యువకులను ఢీకొట్టారు. వారిద్దరినీ లేడీ హార్డింగ్ ఆసుపత్రికి తరలించారు. ఓటమిని ఎదురుగా చూసిన ఆయన, ప్రజల ప్రాణాల విలువను మరిచిపోయారు. నేను ఆసుపత్రికి వెళ్తున్నా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## చేతబడి అనుమానంతో.. వృద్ధురాలిని కొట్టి, వాతలు పెట్టి, మూత్రం తాగించారు

**ముంబై:** ఒక వృద్ధురాలు చేతబడి చేస్తున్నట్లుగా గ్రామస్తులు అనుమానించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెను దారుణంగా హింసించి కొట్టారు. కాళ్లు, చేతులపై వాతలు పెట్టారు. బలవంతంగా మూత్రం తాగించారు. కుక్క మలాన్ని తినిపించారు. మెడలో చెప్పుల దండ వేసి ఊరేగించారు. ఈ దారుణం గురించి తెలిసిన వృద్ధురాలి కుమారుడు, కోడలు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చిఖల్దారా తాలూకాలోని రెత్యాఖేడ గ్రామంలో 77 ఏళ్ల వృద్ధురాలు నివసిస్తున్నది. కాగా, డిసెంబర్ 30న ఆమె కొడుకు, కోడలు పని నిమిత్తం బయటకు వెళ్లారు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆ వృద్ధురాలు చేతబడి చేస్తున్నట్లుగా పొరుగువారు అనుమానించారు. గ్రామస్తులు కర్రతో ఆమెను కొట్టారు. చేతులు, కాళ్లపై వాతలు పెట్టారు. బలవంతంగా మూత్రం తాగించడంతోపాటు కుక్క మలాన్ని తినిపించారు. మెడలో చెప్పుల దండ వేసి ఊరేగించారు. మరోవైపు జనవరి 5న ఆ వృద్ధురాలి కొడుకు, కోడలకు ఈ దారుణం గురించి తెలిసింది. దీంతో స్థానిక పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్, ఎస్పీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. కాగా, అటవీ ప్రాంతంలో ఉన్న ఆ గ్రామానికి పోలీసులను పంపినట్లు అమరావతి జిల్లా ఎస్పీ విశాల్ ఆనంద్ తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్థానిక పోలీసులు ఈ దారుణాన్ని తొక్కిపెట్టినట్లు తేలితే వారిపై కూడా చర్యలు చేడతామని మీడియాకు వెల్లడించారు.






## సంజయ్ ఒక్కడే దోషి కాదు..
### మిగతా వారిని అరెస్ట్ చేయలేదు: బాధితురాలి తల్లి

**కోల్‌కతా:** ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం కేసులో సంజయ్ రాయ్ దోషిగా తేలడంపై బాధితురాలి తల్లి స్పందించింది. అతడు ఒక్కడే నిందితుడు కాదని తెలిపింది. నేరానికి పాల్పడిన మిగతా వారిని ఇంకా అరెస్ట్ చేయలేదని ఆమె ఆరోపించింది. సంజయ్ సహచరులు, ఇతర నేరస్థులను అరెస్ట్ చేసి శిక్షించే వరకు న్యాయం కోసం తాము ఎదురు చూస్తామని చెప్పింది. 'సంజయ్ దోషి అని జీవసంబంధమైన ఆధారాల ద్వారా నిరూపితమైంది. కోర్టులో విచారణల సమయంలో అతడు మౌనంగా ఉన్నాడు. నా కుమార్తెను హింసించి చంపడంలో అతడి పాత్రను ఇది నిరూపించింది. కానీ అతడు ఒంటరిగా లేడు. ఇతరులను ఇంకా అరెస్టు చేయలేదు. కాబట్టి, మాకు ఇంకా న్యాయం జరుగలేదు' అని మీడియాతో ఆమె అన్నారు. మరోవైపు, ఈ కేసు విచారణ ఇంకా పూర్తి కాలేదని బాధితురాలి తల్లి తెలిపింది. తాను, తన భర్త జీవించే చివరి రోజు వరకు న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని ఆమె చెప్పింది. 'కేసు పూర్తి కాలేదు. మా కుమార్తె హత్యాచారంలో పాల్గొన్న ఇతర నిందితులకు శిక్ష పడిన తర్వాత మాత్రమే ఇది పూర్తవుతుంది. ఆ రోజు కోసం మేం వేచి ఉంటాం. ఆ రోజు వరకు మేం నిద్రపోలేం. మేం కోరుకునేది అదే' అని ఆమె అన్నారు. కాగా, గత ఏడాది ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో రాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా సీల్దా సీబీఐ కోర్టు శనివారం నిర్ధారించింది. జనవరి 20న అతడికి శిక్షలు ఖరారు చేస్తామని కోర్టు వెల్లడించింది.

## బాంబులు విసిరి, కాల్పులు జరిపి గ్యాంగ్ లీడర్ బర్త్‌డే సెలబ్రేషన్..




**లక్నో:** గ్యాంగ్ లీడర్ బర్త్ డేను అతడి గ్యాంగ్ సభ్యులు వినూత్నంగా జరిపారు. బిజీ మార్కెట్‌లో బాంబులు విసిరారు. కాల్పులు జరిపి భయాందోళన సృష్టించారు. దర్యాప్తు జరిపిన పోలీసులు ఆ గ్యాంగ్ సభ్యులను అరెస్ట్ చేశారు. ఆ మార్కెట్ ప్రాంతంలో వారిని ఊరేగించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ లీడర్ పుట్టిన రోజును వినూత్నంగా జరుపుకున్నారు. జనవరి 15న కాన్పూర్‌లోని లాల్ బంగ్లా ప్రాంతంలో ఉన్న రద్దీ మార్కెట్ వద్ద అలజడి సృష్టించారు. అక్కడ బాంబులు విసరడంతోపాటు కాల్పులు జరిపారు. దీంతో వ్యాపారులు భయాందోళన చెందారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు జరిపారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ బాంబులు విసిరి కాల్పులు జరిపిన నిందితులను గుర్తించారు. గ్యాంగ్ సభ్యులైన 18 ఏళ్ల సాహిల్, 27 ఏళ్ల దేబు కుమార్ వాల్మీకి, 23 ఏళ్ల రజ్జుల్లాను అరెస్ట్ చేశారు. వారిని ఆ మార్కెట్ వద్దకు పోలీసులు తీసుకెళ్లారు. అక్కడి వ్యాపారులు చూస్తుండగా నిందితులను ఊరేగించారు. మరోవైపు సమాజంలో శాంతికి ఎలాంటి భంగం కలుగకుండా చూస్తామని పోలీస్ అధికారి తెలిపారు. మార్కెట్‌లోని వ్యాపారుల్లో ధైర్యం నింపేందుకే నిందితులను అక్కడ ఊరేగించినట్లు చెప్పారు. అరెస్టైన నిందితుల సహచరులపై నిఘా ఉంచామన్నారు. వారిపై కూడా తగిన చర్యలు చేపడతామని వెల్లడించారు.



# మహా పత్రిక







# సైఫ్‌పై పదేపదే దాడి చేశాడు : కరీనా

ముంబై: సైఫ్ అలీఖాన్‌పై దాడి జరిగిన ఘటన గురించి కరీనా కపూర్ పోలీసులకు వివరించింది. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి.. దూకుడుగా దాడి చేసినట్లు ఆమె చెప్పింది. అయితే ఆ దుండగుడు ఇంట్లో ఉన్న ఆభరణాలను టచ్ చేయలేదని తెలిపింది. బాంద్రా అపార్ట్‌మెంట్‌లో జరిగిన అటాక్ గురించి పోలీసులకు ఆమె తెలియజేసింది. సైఫ్‌తో ఘర్షణ జరిగిన సమయంలో ఆ వ్యక్తి చాలా దూకుడుగా వ్యవహరించినట్లు చెప్పింది. పదేపదే సైఫ్‌పై అటాక్ చేయడాన్ని చూశానని కరీనా తెలిపింది. సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకే ప్రియార్టీ ఇచ్చినట్లు పేర్కొన్నది. దాడి తర్వాత దుండగుడు పారిపోయాడని, విలువైన వస్తువుల్ని ఏమీ తీసుకెళ్లలేదని కరీనా తెలిపింది. పిల్లలు తైమూర్, జెహంగిర్ ను రక్షించే ఉద్దేశంతో ఖాన్ ప్రతిదాడి చేసినట్లు ఆమె చెప్పింది. జెహంగిర్ వద్దకు దుండుగడు చేరుకోలేకపోయాడని, ఆ టైంలో ఖాన్‌పై పలుమార్లు అతను అటాక్ చేసినట్లు ఆమె తెలిపింది. దాడి తర్వాత చాలా ఆందోళనకు గురయ్యానని, అందుకే సోదరి కరిశ్మా తనను ఆమె ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిపింది. అయితే ఇంకా సైఫ్ అలీఖాన్ స్టేట్మెంట్‌ను తీసుకోలేదని పోలీసులు తెలిపారు.

## సిగ్గుగా ఉంది.. సైఫ్ సర్ క్షమించండి : ఊర్వశీ రౌతేలా

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కి క్షమాపణలు తెలిపింది నటి ఊర్వశీ రౌతేలా. నేను మీ గురించి ఇలా మాట్లాడినందుకు సిగ్గుపడుతున్నాను అంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టింది. సైఫ్ అలీఖాన్ మీద దుండగులు దాడి జరిపిన విషయం తెలిసిందే. గత గురువారం తెల్లవారుజామున ముంబై బాంద్రాలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు సైఫ్. అయితే సైఫ్ ఘటనపై బాలీవుడ్ సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు స్పందిస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. అయితే ఈ విషయంపై నటి ఊర్వశీ రౌతేలా మీడియాతో స్పందిస్తూ.. సైఫ్‌పై దాడి దురదృష్టకరం. నేను ప్రస్తుతం డాకు మహరాజ్ సక్సెస్ మూడ్‌లో ఉన్నాను. ఇప్పటివరకు రూ.105కోట్లు వసూళ్లు సాధించింది. ఈ సినిమా సక్సెస్ అయినందుకు మా అమ్మ నాకు డైమండ్ రింగ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. మా నాన్న రోలెక్స్ వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చాడు. అయితే వీటిని ధరించాలంటే ఎవరైన దాడి చేస్తారేమో అని ఇప్పుడు భయమేస్తుంది. అంటూ చెప్పుకొచ్చింది. అయితే రింగ్ ఇచ్చిందంటూ మీడియాకి చూపించడం.. అలాగే ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. సైఫ్ అలీఖాన్ చావు బ్రతుకుల మధ్య ఉంటే నువ్వు ఏం మాట్లాడుతున్నావు అంటూ ఊర్వశీపై నెటిజన్లు దుమ్మెత్తిపోశారు. దీంతో తాజాగా ఈ విషయంపై ఊర్వశీ సైఫ్‌కు క్షమాపణలు తెలిపింది.



# నా రికార్డులన్నీ అన్‌స్టాపబుల్!




'నా కెరీర్‌లో ఎన్నో సినిమాలు చేశాను. గత కొన్నేళ్లుగా వరుసగా నాలుగు విజయాలను సాధించడం ఆనందంగా ఉంది. ప్రతీ సినిమాను ఓ ఛాలెంజ్‌గా భావించి చేశాను. నీటి సమస్యను చర్చిస్తూ గొప్ప సామాజిక సందేశంతో ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రజల్లో ఆలోచనలను రేకెత్తించే ఇలాంటి సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు అగ్ర నటుడు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శుక్రవారం విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'దర్శకుడు బాబీ ఈ సినిమా ద్వారా నా నట విశ్వరూపాన్ని రాబట్టుకున్నాడు. అందుకు ఆయనకు కృతజ్ఞతలు. రైటర్స్, టెక్నీషియన్స్ అందరూ శ్రమించి ఈ కథను అద్భుతంగా తీర్చిదిద్దారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌కు ఇప్పటి నుంచి 'ఎన్‌బీకే తమన్' అని నామకరణం చేస్తున్నా. అంత గొప్పగా మ్యూజిక్ ఇచ్చాడు. అన్ని విభాగాల మీద పట్టున్న నాగవంశీ వంటి నిర్మాత దొరకడం అదృష్టం. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన చిత్రాలు తీయాలని కోరుకుంటున్నా. నా రికార్డులు, కలెక్షన్స్, అవార్డులు, రివార్డులన్నీ అన్‌స్టాపబుల్' అన్నారు. చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఈ సినిమాలో బాలకృష్ణను కొత్తగా చూపించాలని ముందే అనుకున్నాం.




# వీరమల్లు మాట వినాలి

17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో, అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ చారిత్రక యోధుడి పాత్రలో నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'హరిహర వీరమల్లు'. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా మొదలయ్యాయి. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. శుక్రవారం 'మాట వినాలి..' అనే గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ స్వయంగా ఆలపించారు. కీరవాణి స్వరాల్ని అందించిన ఈ గీతాన్ని పెంచల్‌దాస్ రచించారు. 'వినాలి..వీరమల్లు మాట చెప్తే వినాలి' అంటూ తెలంగాణ మాండలికంలో మొదలైన ఈ పాట జానపద శైలిలో సాగుతూ ఆకట్టుకుంది. జీవితంలో ఆశావహ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, ధర్మాన్ని పాటించాలనే సందేశంతో ఈ పాట శ్రోతల్ని మెప్పించేలా ఉంది. అటవీ నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఆర్ట్: తోట తరణి, సమర్పణ: ఏ.ఎం.రత్నం, నిర్మాత: దయాకర్ రావు, దర్శకత్వం: క్రిష్, జ్యోతికృష్ణ.



## క్రీడా వార్తలు | SPORTS NEWS






# రంజీల్లో ఆడతారా..?

## టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఏం చెప్పాడంటే..?

బీసీసీఐ ఆదేశాల మేరకు రంజీల్లో ఆడనున్నట్లు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. ముంబయిజమ్మూ కశ్మీర్ జట్ల మధ్య జరిగే రంజీ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటానని చెప్పాడు. అయితే, అంతర్జాతీయ క్యాలెండర్‌లోని బిజీ షెడ్యూల్ కారణంగా స్టార్ ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సమయం దొరకడం కష్టమని తెలిపాడు. దేశీయ రెడ్‌బాల్ టోర్నీలను ఏ క్రికెటర్ తేలిగ్గా తీసుకోరని రోహిత్ పేర్కొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు శనివారం బీసీసీఐ జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో కలిసి రోహిత్ మీడియా ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా రంజీ ట్రోఫీలో ఆడతారా? అన్న ప్రశ్నకు రోహిత్ సానుకూలంగా స్పందించాడు. గత ఆరేడు సంవత్సరాలుగా క్యాలెండర్‌ను పరిశీలిస్తే తాము 45 రోజులుగా ఇంట్లో కూర్చోలేదని చెప్పాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే అంతర్జాతీయ మ్యాచులు లేనప్పుడు మాత్రమే విశ్రాంతి దొరికేదని తెలిపాడు. డొమెస్టిక్ సీజన్ అక్టోబర్‌లో ప్రారంభమై.. మార్చి వరకు కొనసాగుతుందని.. జాతీయ జట్టు తరఫున అన్ని ఫార్మాట్లలో ఆడని ఆటగాళ్లు దేశీయ క్రికెట్ ఆడొచ్చని చెప్పాడు. తన గురించి చెప్పాల్సి వస్తే.. తాను 2019 నుంచి క్రమం తప్పకుండా టెస్ట్ క్రికెట్‌ను ఆడుతూ వచ్చానని టీమిండియా కెప్టెన్ తెలిపాడు. ఈ పరిస్థితుల్లో చాలా తక్కువ సమయం ఉంటుందని.. అంతర్జాతీయ క్రికెట్‌ను క్రమం తప్పకుండా ఆడుతున్న సమయంలో తమని తాము రిఫ్రెష్ చేసుకోవడం కొంత సమయం అవసరమని అభిప్రాయపడ్డాడు. దేశీయ క్రికెట్‌ని ఎవరూ తక్కువగా తీసుకోవడం లేదని స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా.. 37 ఏళ్ల రోహిత్ శర్మ ఇటీవల టెస్టుల్లో పేలవమైన ఫామ్‌తో ఇబ్బందులుపడుతున్నాడు. చివరి 15 టెస్ట్ ఇన్నింగ్స్‌లో ఒకే ఒక అర్ధ సెంచరీ చేసిన రోహిత్.. ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించేందుకు నిరాకరించాడు. మంగళవారం వాంఖడే స్టేడియంలో ముంబయి జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేశాడు. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. ఐదు ఇన్నింగ్స్‌లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు. విమర్శల నేపథ్యంలో చివరిదైన సిడ్నీ టెస్టుకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్‌లో శ్రీరాం బాలాజీ జోడి ఓటమి

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో ఎన్ శ్రీరాం బాలాజీ, మిగుల్ ఏంజెల్ రియాస్ వరేలా జోడి.. రెండో రౌండ్‌లో ఓడిపోయింది. భారత ఆటగాడు బాలాజీ, మెక్సికో ప్లేయర్ వరేలా.. ఇద్దరూ గట్టి పోటీ ఇచ్చినా.. 67 (7), 64, 36 స్కోరుతో పోర్చుగీస్ జోడి నునో బోర్జెస్, ఫ్రాన్సిస్‌కో కాబ్రల్ చేతిలో పరాజయం చవిచూశారు. సుమారు రెండు గంటల 9 నిమిషాల పాటు మ్యాచ్ రసవత్తరంగా సాగింది. తొలి సెట్ 56 నిమిషాల పాటు హోరాహోరీగా సాగింది. ట్రైబేకర్‌లో బోర్జెస్, కాబ్రల్ జోడి వత్తిడిలో పైచేయి సాదించింది. ఆ తర్వాత రెండో సెట్‌లో ఇండోమెక్సిన్ జోడి తీవ్రంగా పోరాడింది. చాలా ఈజీగా ఆ సెట్‌ను సొంతం చేసుకున్నది. కీలకమై మూడవ సెట్‌లో బోర్జెస్‌కాబ్రల్ జోడి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది.

# ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత జట్టు ఇదే..

## ఫాస్ట్ బౌలర్ బుమ్రా దూరం.. షమీకి ఛాన్స్..!



వచ్చే నెల ఇంగ్లాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత జట్టును శనివారం బీసీసీఐ ప్రకటించింది. చాంపియన్స్ ట్రోఫీకి ముందు జరిగే వన్డే సిరీస్‌లో సెలక్షన్ కమిటీ కేఎల్ రాహుల్ కు జట్టులో చోటు కల్పించింది. ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత టీ20ల్లోకి ఎంట్రీ ఇవ్వనున్న ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి వన్డే జట్టులోనూ అవకాశం ఇచ్చింది. జనవరి 22 నుంచి భారత్‌ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచుల టీ20 సిరీస్ జరుగనున్నది. సూర్యకుమార్ యాదవ్ టీమిండియాను నడిపించనున్నాడు. ఇక వన్డే సిరీస్‌కు రోహిత్ శర్మ నాయకత్వం వహిస్తాడు. వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచులకు ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. అయితే, ఇప్పటి వరకు మూడు వన్డేలో ఆడడం విషయంలోనూ స్పష్టత లేదు. జట్టును ప్రకటించే సమయంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ సైతం చాంపియన్స్ ట్రోఫీ వరకు జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌గా ఉంటాడని ఆశిస్తున్నామన్నారు. బుమ్రా ఫిట్‌గా లేకపోతే.. అతని స్థానంలో హర్షిత్ రాణా అందుబాటులో ఉంటాడు. ఇక హైదరబాదీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కలేదు. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌కు సైతం ఎంపిక చేయని విషయం తెలిసిందే. ఇక ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు తొలిసారిగా వన్డే జట్టులో అవకాశం లభించింది.



# క్రికెటర్ రింకు సింగ్, ఎంపీ ప్రియా సరోజ్ పెళ్లి..!

## పార్లమెంట్ సమావేశాల తర్వాతే డేట్ ఫిక్స్..!

భారత క్రికెటర్ రింకు సింగ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోడుతున్నాడు. ఎస్పీ ఎంపీ ప్రియా సరోజ్‌ను మనువాడనున్నాడు. ఈ విషయాన్ని ప్రియా తండ్రి, యూపీలోని కెరకట్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన తుఫానీ సరోజ్ ధ్రువీకరించారు. పెళ్లి విషయంపై అలీఘడ్‌లో రింకు తండ్రితో చర్చించినట్లు ఆయన వివరించారు. పార్లమెంట్ సమావేశాల తర్వాత నిశ్చితార్థం, వివాహ తేదీలను నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. నిశ్చితార్థం లక్నోలో జరుగుతుందని పేర్కొన్నారు. జౌన్‌పూర్‌లోని మచ్లిషహర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాదీ పార్టీ టికెట్‌పై ప్రియా సరోజ్ గెలుపొందారు. అయితే, రింకు సింగ్, ప్రియా నిశ్చితార్థం జరిగినట్లు వచ్చిన వార్తలు తుఫానీ సరోజ్ కొట్టిపడేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలిపారు. ఇంకా ఇద్దరి నిశ్చితార్థం జరుగలేదని చెప్పారు. గత గురువారం రింకు కుటుంబాన్ని అలీగఢ్‌లో కలిసినట్లు పేర్కొన్నారు. వివాహం విషయంలో చర్చలు అర్థవంతంగా జరిగాయన్నారు. పార్లమెంట్ సమావేశాల జనవరి నెలాఖరు నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయన్నారు. ఈ సమావేశాలు ముగిసిన తర్వాత నిశ్చితార్థం, వివాహ తేదీలను నిర్ణయించున్నట్లు తెలిపారు. ఇక రింకు సింగ్ ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో పాల్గొననున్నాడు. ఆ తర్వాత ఐపీఎల్ జరుగబోతుంది. ఐపీఎల్‌లో కేకేఆర్ తరఫున బరిలోకి దిగనున్నాడు. రూ.13కోట్లకు రింకు సింగ్‌ను కేకేఆర్ కొనుగోలు చేసింది. ఈ క్రమంలో ఎంగేజ్‌మెంట్, వివాహ తేదీల విషయంలో రింకు పెళ్లి తేదీలను జాగ్రత్తగా చూడాల్సి ఉందని.. పెళ్లితో ఆటకు ప్రభావితం కాకుండా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రియా సరోజ్ స్నేహితురాలి తండ్రి క్రికెటర్ అని తుఫానీ సరోజ్ తెలిపారు. ఆయన ద్వారా రింకు, ప్రియా ఇద్దరూ కలిశారన్నారు. ఇద్దరూ ఇరుకుటుంబాల అనుమతి పెళ్లి చేసుకుంటామని చెప్పారని.. ఈ క్రమంలోనే రింకు కుటుంబంతో చర్చలు జరిపామన్నారు. రెండు కుటుంబాల మధ్య పెళ్లి విషయంలో చర్చలు జరిగాయని తుఫానీ సరోజ్ వివరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com